నిర్మలమ్మ ఇన్నాళ్లకు కరుణించారు. ఆదాయపు పన్ను పరిమితులను పెంచుతూ ఎట్టకేలకు పద్దులో పెద్ద పీట వేశా రు. పెరిగిన ఖర్చులకు తోడు ఎడాపెడా ఆదాయపు పన్ను వాతలతో వెన్ను విరిగిన ప్రభుత్వ, ప్రైవేటు జీవులకు ఊరట కలిగించారు. రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయానికి ఎలాంటి పన్ను కట్టక్కర్లేదని పార్లమెంట్ సాక్షిగా బడ్జెట్‌లో ప్రకటించారు. అటు వృద్ధులకూ నిర్మలమ్మ పద్దు వరాలు కురిపించింది. వడ్డీపై ఆదాయంతో పాటు అద్దెపై వచ్చే వార్షిక ఆదాయ పరిమితిని పెంచి వారిని ఆకట్టుకుంది. అన్నదాతలకు కిసాన్ క్రెడిట్ కార్డుల రూపంలో అప్పు పరిమితి పెంచిం ది. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు నిధులు విదిల్చి ఉమ్మడి జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో సాగు చేస్తోన్న రైతులకు తీపికబురు అందించింది. అటు చిన్న తరహా పరిశ్రమలకు ఊతమిస్తూనే కాకినాడ కేంద్రంగా ఉన్న షిప్ బిల్డింగ్ రంగం మరింతగా ఎదిగేలా వెన్నుదన్నుగా నిలిచింది. వెరసి కేంద్ర బడ్జెట్ అన్నివర్గాలను మెప్పించి మురిపించింది. - (కాకినాడ, ఆంధ్రజ్యోతి)



మురిపించే!



బడ్జెట్ బాగు..బాగు



బొమ్మూరులో వృద్ధుడికి పింఛను అందజేసి నమస్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వేతన జీవులకు ఊరట

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను మురిపించింది. ఎప్పుడూ వాతలతో సాగే బడ్జెట్ ఈ దఫా కొన్ని వరాలతో మెప్పించింది. ప్రధానంగా ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలంటూ ఎన్నో ఏళ్లుగా వేతన జీవులు వేడుకుంటున్నా కనికరించని ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ఈ సారి మొర విన్నారు. ఏకంగా రూ.12 లక్షల వార్షికాదాయం వరకు ఒక్క రూపాయి పన్ను కూడా చెల్లించక్కర్లేదని ప్రకటించి ఉద్యోగులపై వరాల వాన కురిపించారు. ఈ నిర్ణయంతో రూ.12 లక్షల వార్షికాదాయం పొందుతున్న వారికి రూ.80 వేల వరకు పన్ను పోటు తప్పి జేబులో డబ్బు మిగల నుంది.ఈ నిర్ణయం వల్ల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 63 వేల మందికి లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా వీరిలో 22 వేల మందికి వార్షిక వేతనం రూ.12 లక్షల వరకు వస్తోంది. వీరికి రూ.80 వేల వరకు మిగ లనుంది. మిగిలిన 41 వేల మంది ఉద్యోగులకు సైతం రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.65 వేల వరకు ప్రయోజనం కలగనుంది. అయితే కొత్త పన్ను విధానం కింద శ్లాబులను ప్రకటించడం కొంత గందరగోళానికి గురి చేసింది. దీని ప్రకారం రూ.4 లక్షల వరకు సున్నా పన్ను,రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పన్ను 5 శాతం, రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు 10 శాతం పన్ను శ్లాబు లను ప్రకటించారు. ఈ శ్లాబు ప్రకారం రూ.12 లక్షల వార్షిక వేతనం ఉన్న వారు పది శాతం పన్ను చెల్లించాల్సి ఉండగా దా న్ని సెక్షన్ 87ఏ రిబేట్ కింద బడ్జెట్‌లో మినహాయిం పునిచ్చారు.దీంతో పన్ను సున్నాగా మారింది. దీనికి తోడు స్టాండర్డ్ డిడక్షన్ సైతం కలిపితే రూ.12.75 లక్షల వార్షికా దాయం వరకు పన్ను చెల్లించ క్కర్లేదు.దీనికి ఒక్క రూపాయి పెరిగినా పన్ను పరిధిలోకి వచ్చేస్తారు.బడ్జెట్ నిర్ణ యం నేప థ్యంలో రూ.8 లక్షల వార్షిక వేతనం ఉంటే రూ.30 వేలు, రూ.9 లక్షలకు రూ.40 వేలు, రూ.10 లక్షలకు రూ.50 వేలు, రూ.11 లక్షలకు రూ.65 వేల వరకు పన్ను పోటు తప్పింది.



పంట పండింది..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2.30 లక్షల హెక్టార్లలో వరి సాగవు తోంది.మొత్తం 5.40 లక్షల మంది రైతులు సాగుచేస్తున్నారు.వీరికి పంట రుణాల కింద ఏటా రూ.7,150 కోట్ల వరకు వివిధ బ్యాంకులు అందిస్తు న్నాయి. అయితే బ్యాంకులు షరతులతో ఇబ్బందులు పెడుతున్నాయి.కౌలురైతులకు అప్పు పుట్టని పరిస్థితి. ఈ నేపథ్యంలో కేంద్రం కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టి సాలీనా ఏడు శాతం వడ్డీకే రూ.3 లక్షల వరకు రుణాలంది స్తోంది. ఏడాదిలోగా రుణం తిరిగి చెల్లిస్తే 3 శాతం వడ్డీ రాయితీ ప్రక టిస్తోంది.ఈ సదుపాయాన్ని ఉమ్మడి జిల్లాలో వరి,ఇతర వాణిజ్య పంటల సాగుకు సుమారుగా 70 వేల మందికిపైగా అన్నదాతలు వాడుకుంటు న్నారు. పశుసంవర్ధకశాఖ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4,600 మంది రైతులు ఈ కార్డులు వినియో గిస్తున్నారు. బడ్జెట్‌లో ఇప్పు డు రూ.3 లక్షల రుణ పరిమితిని రూ.5 లక్షలకు పెంచడంతో వేలాది మంది అన్నదాతలకు ప్రయోజనం కలగనుంది. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కింద సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్రానికి రూ.186 కోట్లు కేటాయించింది.ఈ నిధులు ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లాలో వేలాది మంది రైతులకు ఆర్థికంగా అండ కల్పించనుంది.జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కింద ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల ఎకరాలు సాగవుతోంది. ఇందులో కాకినాడ జిల్లాలోనే 45 వేల ఎకరాలు ఉంది.

- వేతన జీవులకు, వృద్ధులకు ఊరట
- రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను జీరో
- ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షలమందికి లబ్ధి
- వార్షిక వేతనం రూ.12.75 లక్షలున్నా నో ట్యాక్స్
- వృద్ధులకు వడ్డీ, అద్దెలపై పరిమితుల పెంపు
- నేచురల్ ఫార్మింగ్‌కు రూ.186 కోట్లు
- కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంపు
- ఎంఎస్ఎంఈలకు రుణాల పెంపు
- 24 వేలకుపైగా చిన్న కంపెనీలకు ఊతం
- నౌకా రంగానికి భారీవరాలు
- ఉమ్మడి జిల్లాలో 3 డే కేర్ క్యాన్సర్ సెంటర్లు

నౌకాయానం..



నౌకల తయారీ రంగానికి ఈ దఫా బడ్జెట్‌లో కేంద్రం భారీగా ప్రోత్సా హకాలు ప్రకటించింది.దీంతో కాకినాడలో తయారవుతున్న నౌకలకు సంబంధించి ఆయా సంస్థలకు భారీ గా ఆర్థిక ప్రయోజనాలు చేకూరడంతో పాటు ఈ రంగం మరింతగా ఎదగడా ని కి అవకాశం ఏర్పడింది. వాస్తవానికి కాకి నాడలో శాన్ మెరైన్ సంస్థ నౌకల తయా రీలో పేరొందింది. భారీ నౌకల నుంచి మధ్య తరహా షిప్‌లు తయారు చేస్తోంది. అనేక మత్స్యకార సంస్థలు సైతం పెద్ద పెద్ద టగ్‌లు తయారు చేస్తున్నాయి. ప్రధానంగా నౌకల తయారీకి విదేశాల నుంచి ఎక్కువగా అనేక పరికరాలు దిగుమతి చేసుకోవాలి. ప్రస్తుతం వీటిపై సరాసరి 23 శాతం వరకు పన్ను వసూలు చేస్తు న్నారు.కానీ ఇకపై ఇది సున్నా. పదేళ్ల పాటు ఇది అమల్లో ఉండనుంది.నౌకల తయారీకి అయ్యే కోట్ల కొద్దీ ఖర్చుకు సంబంధించి ఆయా కంపెనీలు,సంస్థలు తెచ్చే రుణాలపై ఇంత వరకు సబ్సిడీ లేదు.ఈ బడ్జెట్‌లో ఏకంగా 20 శాతం ఫైనాన్స్ సబ్సిడీ ప్రకటిం చింది.నౌకల తయారీ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. నౌకల తయారీ భవిష్యత్తులో కాకినాడ కేంద్రంగా ఎదిగే అవకాశం ఏర్పడిందని శాన్‌మెరైన్ సంస్థ అధినేత అలీషా విశ్లేషించారు.

క్యాన్సర్ రోగులకు తగ్గనున్న భారం



క్యాన్సర్ రోగులకు దీర్ఘకాలిక ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో బాధితులకు ఊరట దక్కింది. ఖరీదైన మందులు కొనలేక ఆర్థికంగా చితికిపోతున్నారు.మందుల ధరలు దిగిరానుండడం ఊరటనివ్వనుంది. దేశ వ్యాప్తంగా డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటు కానున్నా యి.ఈ కేంద్రాల్లో బాధితులకు వైద్యసాయం లభించనుంది.

చిన్న వాటికి పెద్ద ఊతం..

బడ్జెట్‌లో చిన్న మధ్యతరహా పరిశ్రమల (ఎం ఎస్ఎంఈ)కు రుణాలను రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పెంచారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికవేత్తలకు మేలు జరగనుంది.ఉమ్మడి జిల్లాలో 24 వేల వరకు చిన్నతరహా పరిశ్ర మలున్నాయి.బ్యాంకుల నుంచి రుణాలిస్తున్నా సరిపోవడం లేదు. దీంతో బయట నుంచి అప్పులు తెచ్చి నష్టపోతున్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన రుణ పెంపు ప్రకటన మేలు చేయనుంది. అటు స్టార్టప్‌లకు రుణాలు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంచేలా బడ్జెట్ లో ప్రకటించడం అనేక మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వెన్ను దన్నుగా లభించనుంది.



వృద్ధులకు వరాలు..



వృద్ధుల ఆదాయాన్ని సైతం వదలకుండా ఇన్నాళ్లు పన్ను పేరుతో జేబులు గుల్ల చేసేసిన కేంద్రం ఈ దఫా బడ్జెట్‌లో వారి చేతిలో డబ్బు లాక్కోకుండా ఎంతో కొంత మిగిలేలా నిర్ణయం తీసుకుంది. వృద్ధులు ఆర్జించే బ్యాంకు డిపా జిట్ల వడ్డీపై పన్ను మినహా యింపును పెంచింది. ప్రస్తుతం ఇది రూ.50వేలు ఉండ గా దాన్ని రూ.లక్షకు పెం చారు. అటు అద్దె ఆదాయంపై ఉమ్మడి జిల్లాలో అనేక మంది వృద్ధులైన ప్రభు త్వ ప్రైవేటు రిటైర్డ్ ఉద్యో గులు జీవిస్తున్నారు. వీరికి కూడా నిర్మలమ్మ తీపికబురు అందించారు.వీరికి అద్దెపై వచ్చే వార్షికాదాయం రూ.2.40 లక్ష లు దాటితే చెల్లించాల్సిన పన్నును మినహా యించి రూ.6 లక్షలకు పెంచారు. దీంతో వందలాది మందికి మేలు కలగనుంది.

పిల్లలతో ప్రయోగాలే ప్రయోగాలు..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 170 వరకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్నాయి. కొత్త తరహా ప్రయోగాలు ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్రం ఏటా వీటిని మంజూరు చేస్తోంది. ఒక్కో దానికి రూ.20లక్షల వరకు వెచ్చిస్తోంది. బడ్జెట్‌లో వీటికి కేంద్రం మరింత పెద్దపీట వేసింది. 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది.దీంతో ఉమ్మడి జిల్లాకు భారీగా ఈ ల్యాబ్‌లు మంజూరు కానున్నాయి. తద్వారామరిన్ని పాఠశాలల్లో సైన్స్‌పై విద్యార్థులు ప్రయోగాలు చేసే సౌలభ్యం పెరగనుంది.

పోలవరం ప్రాజెక్టుకు భారీ ఊతం

బడ్జెట్‌లో పోలవరంపై కేంద్రం మరింత కనికరం చూపింది. చాన్నాళ్ళుగా మూలనపడిన ఈ ప్రాజెక్టును గట్టెక్కించే దిశగా శర వేగంగా నిధులు కేటాయిస్తూనే వచ్చారు. ఈ క్రమంలోనే కేంద్ర బడ్జెట్‌లోను పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్ల పద్దు చూపించారు. గడిచిన ఐదేళ్లలో ఇంత మొత్తంలో పోలవరానికి కేటాయించడం దాదాపు ఇదే ప్రథమం. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 2027 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంలో రాష్ట్ర ప్రభుత్వం ఉండగా దీనికి కేంద్రం కూడా ఊతమిస్తూ వస్తుంది. తాజాగా 12 వేల కోట్ల రూపాయలు ఈ మధ్యనే కేంద్రం ప్రకటించగా ఇప్పుడు తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లోను ఐదు వేల కోట్లకుపైబడి కేటాయింపులు పేర్కొనడం పట్ల హర్షం వ్యక్తమవుతుంది. ఇంతకుముందే పోలవరం నిర్మాణానికి గ్రాంటు రూపంలో 12 వేల 157 కోట్ల రూపాయలు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రూ.54 కోట్లు కేటాయించారు.ఈ నేపథ్యంలో పోలవరం పూర్తి కావడానికి ఇక ఆటంకాలు లేవనే పరిస్థితి ఉంది. ఇక ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగేందుకు ఒకవైపు విడుదల చేసిన గ్రాంటు, మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు బట్టి చూస్తే ఇట్టే అవగతమవుతుంది.

మధ్యతరగతికి ఊరట



మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట నిచ్చే బడ్జెట్ ఇది.వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, మహిళలు, యువత, ఇలా అన్ని రంగాలను దృష్టిలో పెట్టుకుని వృద్ధిని పోత్సహించే బడ్జెట్. ఆర్థికాభివృద్ధిని, దేశాభివృద్ధిని ప్రోత్సహించే బడ్జెట్ రూపొందించారు. - పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీ

ఇది వికసిత్ భారత్ బడ్జెట్



వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణం రూ.3 లక్షల నుంచి రూ 5 లక్షలకు పెంపు , రూ.12 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఇవ్వడం చరిత్రాత్మక నిర్ణయం.
- వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ మంత్రి

ప్రజారంజక బడ్జెట్



ప్రజారంజకమైన బడ్జెట్. రైతులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అభినందనీయం.రాష్ట్రానికి కేటాయించిన రూ.3లక్షల కోట్ల నిధులను ఈ బడ్జెట్‌లో రెగ్యులర్ చేయడం రాష్ట్రానికి ప్రయోజనకరం. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.5లక్షలకు పెంచడం రైతులకు ప్రోత్సాహాన్నిస్తుంది.
- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఎమ్మెల్యే, అనపర్తి

2028 వరకు జలజీవన్..



రాష్ట్రంపై కేంద్రం వరాల జల్లు కురిపించింది.రాష్ట్ర ప్రజలకు మేలు చేసే బడ్జెట్. జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరందించాలనే ప్రధాని మోదీ సంకల్పానికి ఈ బడ్జెట్ అద్దం పడుతుంది. జలజీవన్ మిషన్ 2028 వరకు పొడిగింపుతో రాష్ట్రానికి మేలు.
- ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే, రాజమండ్రి

అనుకూల బడ్జెట్



మధ్యతరగతి వర్గాలకు అనుకూల బడ్జెట్. ఇన్‌కమ్ ట్యాక్స్ బెనిఫిట్స్ ,ట్యాక్స్ లిమిట్స్ పెంచడం వంటివి ట్యాక్స్ పెయర్స్‌కు సీనియర్ సిటీజన్లకు ఆనందం కలిగించేలా ఉన్నాయి. కిసాన్ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచడం బాగుంది. - గన్ని కృష్ణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రంచనుగా పింఛను

ఉదయం 11కే 85 శాతం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)
అదే వేగం.. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచీ ఠంచనుగా ఇంటికి వెళ్లి మరీ సామాజిక భద్రత పింఛన్‌ని చేతికి అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల కూడా అదే వేగాన్ని జిల్లా యంత్రాంగం కనబరచింది. శనివారం ఉదయం 10.30 గంటల సమయానికి 79 శాతం పూర్తి చేసింది. జిల్లా కలెక్టర్ ప్రశాంతి నేతృత్వంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పింఛన్ అందించడంలో మంచి ఫలితాలను సాధిస్తున్నారు.జిల్లాలో 2,36,331 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా సాయంత్రం 4గంటలకు 2,21,620 (93.78%) మందికి రూ.95 కోట్ల 62 లక్షల 73 వేలు పంపిణీ చేశారు. మండలాల వారీగా చూస్తే మొదటి మూడు స్థానాల్లో రాజమహేంద్రవరం అర్బన్ 95.70%, కోరుకొండ 95.18%, నిడదవోలు అర్బన్ 95.05% ఉన్నాయి.గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా పింఛను కోసం వృద్ధులు సైతం ముప్పుతిప్పలు పడిన అనుభవం తెలిసిందే. ఇప్పుడు ప్రతి నెలా ఉదయాన్నే పింఛను సొమ్ము ఇంటికే చేరుతుండడంతో లబ్ధిదారులు.. ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొమ్మూరు పంచాయతీ పరిధిలోని పలువురు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి కలెక్టర్ ప్రశాంతి పింఛన్లు అందజేశారు. ఆమె వెంట రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్, డీఆర్డీఏ పీడీ మూర్తి, రూరల్ స్పెషల్ ఆఫీసర్ కేఎన్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు ఉన్నారు.



జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శాంతామణి

డీపీవోగా శాంతామణి బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా వి.శాంతామణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం వైటీసీలో ఉన్న జిల్లా గ్రామపంచాయతీ అధికారి కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె కొవ్వూరు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేశారు. ఈమెకు ఏవో జగదీశ్వరి , కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

2 రోజులు.. 1536 రిజిస్ట్రేషన్లు



కడియం ఆర్‌వోలో శుక్రవారం రాత్రి కక్షిదారుల క్యూ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)
భూముల విలువ పెరగడం రిజిస్ట్రేషన్ శాఖకు కలిసొచ్చింది. జనవరి నెలలో లక్ష్యాలను సాధించలేకపోవడంతో తలపట్టుకున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు నెలాఖరు రెండు రోజుల ఆదాయం కాస్త ఊరట కలిగించింది. శనివారం నుంచి పెంచిన భూముల విలువను ప్రభుత్వం అమల్లోకి తీసుకురావడంతో గురు, శుక్రవారాలు(గత నెల 30,31) రిజిస్ట్రేషను కార్యాలయాలు జాతరను తలపించాయి. సాధారణంగా కొనుగోలు చేయడానికి మంగళ వారం, విక్రయించడానికి శుక్రవారం వెనకడుగు వేస్తుంటారు.కానీ భూముల విలువ పెరిగితే రిజిస్ట్రేషను రుసుం తదితర ఖర్చులు కూడా పెరుగుతా యి. అందువల్ల శుక్రవారం సెంటిమెంటును సైతం పక్కన పెట్టి కక్షిదారులు రిజిస్ట్రారు కార్యాలయాలకు క్యూ కట్టారు.ఆ ఒక్క రోజున జిల్లాలో రికార్డు స్థాయిలో 834 రిజిస్ట్రేషన్లు జరి గాయి. సర్వర్లు మొరాయించినా క్రయవిక్రయ దారులు

30న, 31న రిజిస్ట్రేషన్లు ఇలా..

కార్యాలయం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం
అనపర్తి	35	25,42,000	78	50,46,000
అనంతపల్లి	93	50,71,735	99	41,93,572
బిక్కవోలు	72	41,90,063	43	15,93,840
కడియం	62	67,19,295	58	59,74,440
కోరుకొండ	40	27,68,425	26	20,39,345
కొవ్వూరు	72	42,67,959	97	91,11,376
నిడదవోలు	48	39,30,565	60	24,28,900
పిడింగొయ్యి	43	1,18,94000	68	1,10,02,000
రాజమండ్రి	78	94,75,000	126	1,10,58,595
రాజానగరం	115	1,32,74,275	114	1,16,12,510
సీతానగరం	22	6,27,980	23	8,04,495
వేగేశ్వరపురం	22	1,52,000	42	3,02,700

భూముల విలువ పెంపుతో ముందస్తుగా..

మాత్రం ఓపిగ్గా రిజిస్ట్రేషను ప్రక్రియ పూర్తి చేశారు.మొత్తానికి జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల ద్వారా రెండు రోజుల్లో 1536 రిజిస్ట్రేషన్లు జరగ్గా రూ.13 కోట్ల 41 లక్షల 73 వేల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యింది. రాజానగరం, పిడింగొయ్యి, రాజమ హేంద్రవరం మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఎనీవేర్ రిజిస్ట్రేషను(కార్డ్ ప్రైమ్ 2.0)లో అప్రూవల్ కాల పరిమితిని కూట మి ప్రభుత్వం 48 గంటలకు పొడిగించడం వల్ల రిజిస్ట్రేషన్ల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోందని ఓ సబ్ రిజిస్ట్రారు అభిప్రాయం వ్యక్తం చేశారు.గతంలో ఆ సమయం గంట మాత్రమే ఉండేది.ఈ జనవరి నుంచి ఆ సమయాన్ని 48 గంటలకు పెంచడంతో అప్రూ వల్ రావడం ఆలస్యం అవుతోంది.దీంతో కక్షిదారులు ఇబ్బంది పడుతున్నారు.

పెళ్లిసందడి.. వచ్చేసింది..



కడియం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం వచ్చేసింది. పెళ్లింట సందడి తెచ్చేసింది.. మాఘమాసంలో వివాహ ముహూర్తాలకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ఈ సీజన్‌లో పెళ్లిళ్లు చేసుకునేందుకు వధూవరుల కుటుంబాలు ఆసక్తి చూపుతాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు పంటలు చేతికి వచ్చి విరామ సమయంగా ఉండడంతో మాఘ మాసంలో పెళ్లిళ్లకు అనువైన సమయంగా భావిస్తుంటారు.ఇప్పటికే ఈ మాసం ప్రారంభం కావడంతో వివాహాలు ఊపందుకున్నాయి. దీంతో శనివారం నుంచి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. నాలుగు నెలల పాటు పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. ముందస్తు బుకింగ్‌లకు సన్నద్ధమవుతున్నారు. అంతే కాకుండా రాజమహేంద్రవరం మార్కెట్ కళకళలాడుతోంది. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే పాన్‌షాపుల నుంచి వస్త్ర, బంగారు దుకాణాలకు గిరాకీ ఉంటుంది. కల్యాణ మండపాలు, అలంకరణ, లైటింగ్, సౌండ్ సిస్టమ్, పూల అలంకరణలు, బ్యూటీషియన్, ఫొటో స్టూడియోలకు, ఇంకా పలురకాల మార్కెట్‌లకు చేతినిండా పని దొరుకుతుంది. ఉమ్మడి జిల్లాలో కల్యాణ మండపాలు 1000 వరకు ఉన్నాయి. ఇవన్నీ ఇప్పటికే బుకింగ్‌లతో నిండిపోయాయి. జిల్లాలో ప్రధాన పట్టణాలతో పాటు చిన్నచిన్న గ్రామాలు, కూడళ్లలో కల్యాణ మండపాలకు డిమాండ్ వచ్చింది. పెళ్లిళ్ల సందడితో హడాహుడి నెలకొంది.

- నేటి నుంచి ముహూర్తాలు
- 4 నెలల పాటు పెండ్లి సందడే
- కళకళలాడుతున్న మార్కెట్
- మండపాలకు డిమాండ్
- జోరుగా వివాహాలు

ముహూర్తాలు ఇలా..

- ఫిబ్రవరి : 2, 6, 7, 8, 12, 13, 14, 15, 16, 20, 22, 23
- మార్చి : 1, 2, 7, 9, 12, 14, 15, 16
- ఏప్రిల్ : 9, 10, 11, 12, 17, 18, 20, 23, 29, 30
- మే : 1, 7, 8, 9, 10, 11, 14, 15, 16, 17, 18, 21, 22, 28(జ్యేష్ఠమాసం)



గోవిందా...హరిగోవిందా !


ప్రత్యేకాలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.33.62లక్షలు



ఆత్రేయపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):కోనసీమ తిరు మల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.33.62 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

4న గోవిందమాల దీక్షాధారణ

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందమాల దీక్షాధారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. ఈనెల 4 రథసప్తమి మంగళవారం శ్రీనివాస శరణాగత దీక్ష ప్రారంభిస్తున్నట్లు, 24 రోజులపాటు దీక్ష ప్రారంభిస్తారని 26తో దీక్ష ముగిస్తుందన్నారు. మాలధారణ చేపట్టే భక్తులకు దేవస్థానం తరుపున దీక్షా వస్త్రాలు, మాలలు వసతి, భోజనం దేవస్థానం ఉచితంగా ఏర్పాటుచేస్తుందని తెలిపారు. మహిళాదీక్షదారులకు ఏకాదశి దినదీక్ష 11 రోజులకు దీక్ష చేపట్టవచ్చునని ఈనెల 14న ఈ దీక్ష ప్రా రంభమవుతుందన్నారు. ప్రతిఏటా మాదిరిగానే గోవిందమాలదీక్షాధారణ దేవస్థానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


భీమేశ్వరాలయం వద్ద నిర్మాణంలో ఉన్న డార్మెటరీని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే చినరాజప్ప, తుమ్మల బాబు

కూటమి ప్రభుత్వంతోనే పర్యాటకం అభివృద్ధి

పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

సామర్లకోట, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యం అయిన పర్యాటకం అభివృద్ధి చేసేందుకు తిరిగి పూర్వవైభవం తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు కృషిచేస్తున్నారని రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొ న్నారు. శనివారం సామర్లకోటలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక కుమారరామ భీమేశ్వరాలయం వద్ద నిర్మాణంలో ఉన్న పలు భవనాలను, భక్తులు వినియోగించే డార్మెటరీ భవనాన్ని మంత్రి పరిశీలించారు. ఎమ్మెల్యే నిమ్మ కాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ టూరిజం పాలసీ నూతనంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలకు ప్రభుత్వం ఇ స్తున్న రాయితీలవలె పర్యాటక రంగానికి సైతం ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి దుర్గేష్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలంగాణా రాష్ట్రం తరహాలో సినీపరిశ్రమ అభివృద్ధి చెందేందుకు గల సాధ్యా సాధ్యాలపై ప్రభుత్వం అధ్యయనం చేస్తుందన్నారు. దీని కోసం త్రిసభ్య కమిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారని మంత్రి దుర్గేష్ చెప్పారు. ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


డబ్బుల బ్యాగ్‌ను తిరిగి అప్పగిస్తున్న దృశ్యం

పోలీస్ కానిస్టేబుల్ నిజాయితీ

- పొరపాటున దుస్తుల బ్యాగ్‌తోపాటు రూ.8లక్షల బ్యాగ్ ఇచ్చేసిన వస్త్రదుకాణం యజమాని
- కాసేపటికి గ్రహించి జగ్గంపేట పోలీసులకు సమాచారం
- డబ్బుల బ్యాగ్ తిరిగి అప్పగించిన కాకినాడ ఏపీఎస్పీ పోలీస్ కానిస్టేబుల్

జగ్గంపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ఓ పోలీస్ కానిస్టేబుల్ నిజాయితీ కనబర్చాడు. స్థానిక మెయిన్‌రోడ్‌లోని ఓ వస్త్ర దుకాణంలో శనివారం మధ్యాహ్నం కాకినాడ మూడో ఏపీఎస్పీ బెటాలియన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ తోట సూరిబాబు దుస్తులు కొనుగోలు చేశాడు. ఆ షాపు యజమాని అతడి దుస్తుల కవర్లతోపాటు పొరపాటున షాప్‌కు చెందిన రూ.8లక్షలు ఉన్న కవరును కూడా ఆ పోలీస్ కానిస్టేబుల్‌కు ఇచ్చేశాడు. కాసేపటికి విషయాన్ని గ్రహించిన షాపు యజమాని వెంటనే కంగారుపడి స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన సీఐ శ్రీనివాస్ పొరపాటున డబ్బులు బ్యాగ్ తీసుకువెళ్లిన పోలీస్ కానిస్టేబుల్ తోట సూరిబాబును గుర్తించారు. అతడికి సమాచారం అందించి ఆ సొమ్ము తిరిగి తీసుకురావాల్సిందిగా కోరారు. వెంటనే కానిస్టేబుల్ తోట సూరిబాబు తన వద్దఉన్న రూ.8లక్షల బ్యాగ్‌ను గుర్తించి జగ్గంపేట పోలీ సులకు అందజేశారు. నిజాయితీగా నగదును తిరిగి అప్పగించిన సూరిబాబును జగ్గంపేట సీఐ శ్రీనివాస్ అభినందించారు.

నేడు రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సమావేశం

పిఠాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా రగ్బీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు కాకినాడజిల్లా పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో జరుగుతుందని సంఘం అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్ తెలిపారు. సంఘ సభ్యులందరూ ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి
దివ్యాంగురాలి మృతి

- పెన్షన్ తీసుకునేందుకు వెళ్తుండగా ఘటన


బస్సు నుంచి జారిపడి మృతిచెందిన నడవపల్లి భద్రం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం అంగరలో శనివారం ఉదయం ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి దివ్యాంగురా లు నడవపల్లి భద్రం(54) మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.... బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం ఎండగండి గ్రామానికి చెందిన ఒంటరి మహిళ అయిన నడవపల్లి భద్రం అంగరలోని తన అక్క పావులూరి వీరవేణి ఇంటి వద్ద ఉం టుంది. శనివారం ఉదయం అంగర నుంచి ఎండగండిలో పెన్షన్ తీసుకునేందుకు అంగర గాంధీ సెంటర్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా జారిపడి బస్సు వెనుక చక్రంలో పడి మృతి చెందింది. వికలాంగురాలైన ఆమెకు ఒక కుమారుడు ఉండగా అతడు కాజులూరులో ఉంటున్నాడు. అంగర గ్రామంలో అక్క ఇంటివద్ద ఉంటూ పించన్‌తోనే ఆమె జీవనం కొనసాగిస్తుంది. దీనిపై మండపేట రూరల్ ఎస్ఐ బుచ్చిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ బుచ్చిబాబు తెలిపారు.

భద్రమ్మ కుటుంబానికి అండగా ఉంటాం: జేసీ

కె.గంగవరం: పింఛన్ తీసుకోవడానికి బస్సు ఎక్కుతూ ప్రమాదానికిగురై ప్రాణాలు విడిచిన నడవపల్లి భద్రం కుటుంబానికి అండగా ఉంటామని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. భద్రం శనివారం కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో ప్రమాదానికిగురై చనిపోయింది. అక్కడి నుంచి పోస్టుమార్టం పూర్తి చేసుకుని స్వగ్రామం యండగండి తరలించారు. యండగండిలో అంత్యక్రియలు పూర్తి చేశారు. భద్రం కుమారుడు దుర్గాప్రసాద్‌ను ఇతర కుటుంబ సభ్యులను జేసీ శనివారంరాత్రి యండగండిలో పరామర్శించారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆమె వెంట రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, తహశీల్దార్ బండి మృత్యంజయరావు, ఆర్.ఐ.వెంకట్రావు, వీఆర్వో బాబి, సర్పంచ్ చోడే గోవిందరాజు ఉన్నారు.


యండగండిలో భద్రం కుమార్తును పరామర్శిస్తున్న జేసీ నిషాంతి

వెంకటాపురం ఇంగ్లీష్ టీచర్ సస్పెన్షన్

రంగంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వెంకటాపురం ఎంపీపీ స్కూల్లో పనిచేస్తున్న ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు డీ.సుశీల బాధ్యతరాహిత్యంగా వ్యవహరించిన కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఏపీ సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్ 1964కి లోబడి సస్పెన్షన్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులతో కారు శుభ్రపరచడం, ఇతర వ్యక్తిగత పనులు చేయించడంపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన తర్వాత వాస్తవాలను నిర్ధారించిన తర్వాత సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కోరుకొండ ఆలయ దత్తత నుంచి
అన్నవరం ఆలయానికి విముక్తి కలిగించాలని లేఖ

అన్నవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం దత్తత ఆలయమైన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అన్నవరం దేవస్థానం దత్తత నుంచి మినహాయించాలని దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దేవదాయ కమిషనర్‌కు లేఖ ద్వారా తెలియపరిచారు. ఆలయంలో పరిపాలనపరమైన ఇబ్బందుల దృష్ట్యా సిబ్బంది అన్నవరం దేవస్థానం నుంచి పంపించడం వ్యయప్రయాసలతో కూడుకోవడం తరచూ ఏదో వివాదం చుట్టుముట్టుతుండడంతో దేవస్థానం అధికారులు ఈనిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కోరుకొండ ఆలయాన్ని అన్నవరం దేవస్థానానికి దత్తతగా ఇవ్వడంతో అప్పటినుంచి పాలనాపరమైన వ్యవహారాలు అన్నవరం దేవస్థానమే చూసుకుంటూవచ్చింది. అక్కడ ఉత్సవాల నిర్వహణ, భూముల పరిరక్షణ క్లిష్టపరమైన బాధ్యతలు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏటా సుమారు రూ.30 లక్షల వరకు అన్నవరం దేవస్థానం వ్యయం చేయాల్సి వస్తోంది.

సామర్లకోటలో తాడేపల్లిగూడెం 'నిట్' బృందం పర్యటన

- తాగునీటి సరఫరాను పరిశీలించిన బృందం

సామర్లకోట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాల్టీ పట్టణ ప్రజలకు రోజూవారీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరాను శనివారం తాడేపల్లిగూడెంనకు చెందిన నిట్ జాతీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ల బృందం నలుగురు సభ్యులు సామర్లకోటకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణ తాగునీటి సరఫరాపై ప్రజ ల నుంచే గాకుండా కౌన్సిలర్ల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు నిట్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఫిల్టర్ వాటర్ స్కీంవద్ద నీటి పరిశుభ్రత, క్లోరిన్, ఆలమ్‌ల కలయిక, క్లోరినేషన్ చర్యలు, నీటి పంపింగ్ అంశాలు పరిశీ లించారు. గోదావరి జలాలు నిల్వలుచేసే వేసవి జలాశ యంలో నీటి నిల్వలు పరిశుభ్రంగా ఉన్నాయా, దుర్గంధం వెదజల్లుతున్నాయా అనే అంశాలు పరిశీలించారు. గోదావరి కాలువ నుంచి జలాశయంనకు వెళ్లే ఇన్‌లెట్, జలాశయం నుంచి ఫిల్టర్‌ప్లాంట్‌కు వెళ్లే ఇన్‌లెట్‌లను పరిశీలిం చారు. అనంతరం గోదావరి కాలువ నుంచి జలాశ యంలోకి వెళ్లే ఇన్‌లెట్ మార్గాలను సైతం పరిశీలి ంచారు. శుద్ధిచేసిన నీటిని ట్యాంకులకు పంపింగ్ వంటి అంశాలతోపాటు ఓవర్‌హెడ్ ట్యాంకుల నుం చి కుళాయిలకు సరఫరా వంటి అంశాలను పరి శీలించారు. ఆయా ప్రాంతాల నుంచి సుమారు 9 బాటిళ్లతో నీటి నమూనాలు సేకరించి విశ్లేషణ నిమిత్తం బృందం తమ వెంట తాడేపల్లిగూడెం తీసుకువెళ్లారు. ప్రొఫెసర్లు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ జలాశయం నుంచి రాబార్ ద్వారా శుద్ధిచేసే విధానాన్ని మరింత పెంచా ల్సి ఉందన్నారు. శుద్ధిచేసిన నీటిలో పీపీఎం శాతాన్ని పరీక్షించిన తర్వాతే ట్యాంకులకు పంపింగ్ చేయాల న్నారు. ప్రస్తుతం ఫిల్టర్ వాటర్ నిర్మించి 20 ఏళ్లు పైబడినందున పనితీరు సామర్థ్యం పరీక్షించాల్సి ఉందన్నారు. నూతనంగా ఏర్పాటుచేయాలా, ఇదే మరమ్మతులు చేపట్టాలా అనే అం శాలపై ల్యాబ్‌లో విశ్లేషణల అనంతరం నివేదికలు ప్రభు త్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ బృందంలో నిట్ యూనివర్శిటీ నుంచి డాక్టర్ భరణి, డాక్టర్ రేష్మా, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సుభానిలు ఉన్నారు. వీరి వెంట సామర్లకోట మున్సిపల్ డీఈ శశిధర్, ఏఈ శ్రీనివాస్, ఎమి నిటీ కార్యదర్శి ఉండూరు శ్రీనివాస్, సూపర్‌వైజరు శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.


సామర్లకోటలో తాగునీటి సరఫరాపై నిట్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు పరిశీలిస్తున్న దృశ్యం

బైక్‌ను లారీ ఢీకొని ఇద్దరి మృతి

- జాతీయ రహదారిపై భీమవరం వద్ద ఘటన



మృతులు కురసం భద్రయ్య, పొడియం రాజారావు (ఫైల్)


ఘటనలో మృతి చెందిన భద్రయ్య, రాజారావు

ఎటపాక, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎదురు గా వస్తున్న బైక్‌ను ఐరన్ లోడ్ లారీ రాంగ్ రూట్‌లో వెళ్లి ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు ఆది వాసీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి విజ యవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై అల్లూరి జిల్లా ఎటపాక మండలం చోడవరం పంచాయతీలోని భీమవరం గ్రామంవద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీపురం పంచా యతీలోని కన్నాపురం గ్రామానికి చెందిన కురసం భద్రయ్య, (41), పొడియం రాజారావు(31) ఇద్దరు కలిసి బైక్‌పై భద్రాచలం వెళ్లి తిరిగి రాత్రి సమయంలో ఇంటికి వస్తున్నారు. ఈక్ర మంలో చింతూరువైపు నుంచి భద్రా చలం వస్తున్న ఐరన్‌లోడ్ లారీ భీమవరం వద్దకు రాగానే రాంగ్‌రూట్‌లో వెళ్లి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో భద్రయ్య, రాజారావులకు తీవ్ర గాయాలతో అక్కడికక్క డే దుర్మరణం చెందారు. స్థానికులు 108 కు సమాచారంతో ఇవ్వడంతో ఇరువురిని భద్రాచ లం ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ఘటన జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు. ఇరు వురిది వ్యవసాయ కూలీ కుటుంబ నేపథ్యం కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాల కు పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యు లకు అప్పగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

- ఒకరు మృతి, నలుగురికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో మరణించిన సోమరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు గ్రామం ఆటోనగర్ జంక్షన్‌వద్ద ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో 80 ఏళ్ల వృద్ధుడు మృతి చెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన సోమరాజు అతడి తమ్ముడి కుటుంబ సభ్యులు కలిసి బెండపూడి బంధువుల ఇంటికి ఆటోలో వెళ్లారు. తిరిగి దివాన్‌చెరువు మీదుగా రాజమహేంద్రవరం వస్తుండగా ఆటోనగర్ సెంటర్‌లో ఓ లారీ ఆటోనగర్ లోంచి బయటకు వస్తూ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బోడపాటిసోమరాజు (80) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న దొమ్మేటి అర్జునరావు, అచ్చియ్యమ్మ, మల్లిబాబులకు తీవ్రగాయాలయ్యాయి. సత్యనారాయణ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బొమ్మూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి సోమరాజు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తుచేస్తున్నారు.

వివాహిత హత్య కేసులో భర్తే కాలయముడు

- నిందితుడిని అరెస్టుచేసిన పోలీసులు


నిందితుడిని అరెస్ట్ చేసిన కొత్తపల్లి పోలీసులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద మృతి కేసులో భర్తను శనివారం అరెస్ట్ చేసినట్లు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ చెప్పారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. మూలపేటకు చెందిన రాచపల్లి ప్రసాద్ అదే గ్రామానికి చెందిన గింజాల బాలను 9 సంవత్సరాలక్రితం ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. జనవరి 18న బాల అర్ధరాత్రి సమయంలో మృతి చెందడంతో భర్త ఎవరికీ చెప్పకుండా శ్మశానంలో పూడ్చిపెట్టడంతో మృతురాలి తల్లి గింజాల లక్ష్మికి అనుమానం వచ్చింది. దీంతో ప్రసాద్‌కు వేరే అమ్మాయితో అక్రమ సంబంధం ఉందని, తన కుమార్తెను అడ్డుతొలగించుకునేందుకు ప్రసాదే హత్య చేశాడని ఆమె కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం పూడ్చిపెట్టిన మృతురాలి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా బాలను మెడకు చున్నీతో బిగించి ఊపిరి ఆడకుండా చేసినట్టు రిపోర్టు రావడంతో అనుమానాస్పద మృతి కేసును హత్యకేసుగా నమోదుచేసి నిందితుడిని ఆచూకీ కోసం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో నిందితుడు ప్రసాద్ మూలపేట వీఆర్వో ద్వారా పోలీసులకు లొంగిపోయి తానే తన భార్యను హత్య చేశానని ఒప్పుకున్నాడని తెలిపారు. బాలకు వాంతులు వీరోచనాలతో మృతి చెందిందని తల్లికి తప్పుడు సమాచారం ఇచ్చానని అంగీకరించాడని సీఐ శ్రీనివాస్ చెప్పారు. ఈ కేసులో నిందితుడు ప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్‌కు పంపించినట్టు తెలిపారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పక్కింటికి ఎదురింటికి వెళ్ళవద్దని ఇంట్లోనే ఉండాలని తల్లి మందలించిందని ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం శేషయ్యమెట్టకు చెందిన దాసరి తులసీ, శ్రీనివాస్ దంపతులకు నాగసాయి దుర్గ(12), ఓ బాలుడు సంతానం. 2021లో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ మృతి చెందాడు. దాంతో తులసీ అదే ఏడాది బోగిన నాగేశ్వరావు అనే డ్రైవర్‌ను రెండో పెళ్లి చేసుకుంది. అప్పటి నుంచి తల్లితో సాయిదుర్గ ఇష్టంగా ఉండడం లేదు. ఎక్కువ శాతం ఇరుగింటి వద్ద పొరుగింటి వద్ద ఉంటోంది. స్థానికంగా ఓ స్కూల్లో 7వ తరగతి చదువుతోంది. తులిసి మెయిన్ రోడ్డులోని ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. ఉదయం పనికి వెళ్లి సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చి పిల్లలకు భోజనం తయారు చేసి తిరిగి పనిలోకి వెళ్లిపోతుంది. ఈ క్రమంలో శుక్రవారం దుర్గ స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి వద్ద ఉండడంతో మందలించి వెళ్లింది. సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చి అన్నం వండి ఎదురింటి వద్ద ఉన్న దుర్గను పిలిచి మందలించింది. దీంతో ఇద్దరు గొడవ పడ్డారు. ఆపై ఇంట్లో ఉండాలనిచెప్పి తల్లి వెళ్లిపోయింది. తల్లితో గొడవ పడిన దుర్గ తల్లి వెళ్ళిపోయాక ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుంది. రాత్రి తల్లి వచ్చి చూసే సరికి ఫ్యానుకు వేళాడుతు కనిపించింది. స్థానికుల సహకారంతో దుర్గను కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీ తరలించారు.

పోలీసు లాంఛనాలతో ఎస్ఐకు అంత్యక్రియలు

- నివాళులర్పించిన అడిషనల్ ఎస్పీ ప్రసాద్
- అంత్యక్రియలకు హాజరైన సహచర ఎస్ఐలు, సిబ్బంది
- గంగవరంలో విషాద ఛాయలు



ఎస్ఐ మూర్తి పార్థివదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు, కోటిపల్లి శ్మశానవాటిక వద్ద నివాళి అర్పిస్తున్న పోలీసులు

కె.గంగవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తణుకులో చనిపోయిన ఎస్ఐ ఆదుర్తి జీ.ఎస్.మూర్తి పార్థివదేహాన్ని పోస్టుమార్టం అనంత రం శుక్రవారం రాత్రి ఆయన స్వగ్రామం కె.గంగవరం తీసుకువచ్చారు. శనివారం ఉదయం నుంచి గ్రామస్తులు, సహచర పోలీసు సిబ్బంది, బంధువులు సందర్శించి నివాళులర్పించారు. మూర్తి భౌతికకాయాన్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారు సానుభూతి తెలిపారు. మూర్తి పనిచేసిన పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చిన పోలీసులు ఆయన బ్యాచ్‌కు చెందిన సహచర ఎస్ఐలు మూర్తి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుమ్మరి శాలివాహన సంఘం అధికారప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి, ప్రచార కార్యదర్శి రాలి శ్రీనివాసవడయార్, కె.గంగవరం నాయకులు ఏడిద నాగరాజు, తదితరులు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కోటిపల్లి గోదావరి ఒడ్డున స్మశానవాటికకు తరలించారు. అక్కడ రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ, పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు.

ఎస్ఐ మూర్తి కుటుంబాన్ని ఆదుకుంటాం: మంత్రి సుభాష్


ఎస్ఐ మూర్తి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ): నిరుపేద కుటుంబం నుంచి పోలీసుశాఖలో ఎస్ఐ స్థాయి అధికారిగా ఎదిగిన ఏజీఎస్ మూర్తి అకాల మరణం బాధాకరమని మంత్రి సుభాష్ ఆవేదన వ్యక్తం చేశారు. తణుకులో ఎస్ఐ మూర్తి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎస్ఐ మూర్తి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. కె.గంగవరానికి చెందిన ఆదుర్తి గంగ సత్యనారాయణమూర్తి కష్టపడి చదువుకుని ఎస్ఐగా ఉద్యోగం సంపాదించారని అన్నారు. ఆయన మరణవార్త కలచివేసిందన్నారు. ఎస్ఐ మూర్తి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు.

కూటమి అభ్యర్థి విజయానికి సమష్టి కృషి చేయాలి

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంను అత్యధికక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలోని చిర్ల తిలక్‌రెడ్డి వర్తక సంఘ కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమాయత్త సమావేశాన్ని నిర్వహించారు. తర్వాత టీడీపీ జాతీయ ప్రధాన కార్యకదర్శి, జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలో ఉభయ గోదావరి జిల్లాల్లోనే అత్యధిక మెజారిటీ సాధించే విధంగా కూటమి నేతలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, ఆళ్ల గోవింద్, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వేణు గోపాలరెడ్డి, జుత్తుగ కృష్ణ సూర్యకుమారి, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, రావాడ నాగు, శివరామకృష్ణంరాజు, నాలుగు మండలాల కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట దళితుల ఆందోళన


బాధితుడుకి మద్దతుగా
ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన

రాజానగరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కరెంటు తొలగించి, అర్ధరాత్రి సమయంలో తన ఇంటి ముందు గుమ్మాలకు అడ్డుగా బల్లలు ఏర్పాటు చేసి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ తోకాడకు చెందిన మేకల లక్ష్మీపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు దళిత, ప్రజ సంఘాల సహకారంతో ఆయన శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాడు. దీంతో ఎంపీడీవో ఏజే ఝాన్సీ, తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, డీఎస్పీ, సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్ఐ నాగార్జున ఇరువర్గాలతో చర్చించారు. బల్లలు తొలగించేందుకు అంగీకరించడంతో సమస్య పరిష్కారమైనట్టు బాధితుడు తెలిపాడు. బీఎస్పీ జిల్లా నాయకులు ఇసుకపల్లి రాంబాబు, నక్కా వెంకటరత్నం, మానవ హక్కుల నాయకులు కొంకి రమేష్, మాలల ఐక్య వేదిక సభ్యులు ప్రత్తి నాగేశ్వరరావు, ఏగి దేవానందం, కొల్లాటి చినవెంకన్న, ఏఐకెఎంఎస్ డివిజన్ నాయకులు జనిపల్లి సత్తిబాబు, మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, తోటకూర బేబి, ఎన్.సూర్యారావు, పినిపే నాని, మేకల వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన సంస్కృతులను కాపాడుకోవాలి

● బల్లల పండుగలో ఎమ్మెల్యే వాసు


బల్లల పండుగలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మన ప్రాచీన సంస్కృతులను కాపాడుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కోటిలింగాలపేట శివరామరజక సంక్షేమ అభివృద్ధి సంఘం శనివారం నిర్వహించిన బల్లల పండగకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి గంగమ్మను దర్శించుకుని పూజలు చేశారు. మనం ఆధునిక యుగంలో ఉన్నా సంస్కృతిని కాపాడుకుంటూ ఇటువంటి పండుగలను నిర్వహించుకోవడం ఆనందకరమన్నారు. కులవృత్తులపై గౌరవం ఉన్నవారు తమ సంప్రదాయాలను కొనసాగిస్తున్నారన్నారు. రజక సేవా సంఘం టౌన్ అధ్యక్షుడు బొమ్మదేవర శ్రీనివాస్, బట్నవిల్లి సత్తిబాబు, మల్లెల శ్రీనివాస్, ఎస్. శివ, ఉల్లూరి వెంకటేశ్వర్లు, గోకేటి కృష్ణ పాల్గొన్నారు.


రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన డీజీపీగా ఎన్నికైన హరీశ్ కుమార్ గుప్తాను శనివారం మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్.

కీలక రంగాలు బలోపేతం



● కాశీ నవీన్‌కుమార్, ఎస్సీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్

రాష్ట్రంలో కీలక రంగాలను బలోపేతం చేసేవిధంగా కేంద్ర బడ్జెట్ ఉంది. విద్యుత్ రంగం, పట్టణాభివృద్ధి, మైనింగ్, ఆర్థిక రంగం, నియంత్రణ సంస్కరణలు అనే కీలక రంగాలపై కేంద్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన విషయాన్ని నిధుల కేటాయింపుల విషయంలో స్పష్టం చేస్తున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు పడుతున్న కష్టానికి తగిన విధంగానే రాష్ట్రానికి కేటాయింపులు దక్కాయి. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

● మండల పరిధిలో రూ. లక్షా 12 వేల 27 రికవరీకి ఆదేశాలు
● సుమారు రూ. 84 లక్షలతో చేపట్టిన పనులపై ఏపీడీ విచారణ
● కాతేరు ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో రాజమండ్రి రూరల్ మండల పరిధిలోని 10 గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించి శనివారం సామాజిక ప్రజావేదిక తనిఖీ నిర్వహించారు. ఎలక్షన్ కోడ్ ఉన్న కారణంగా డ్వామా పీడీ కార్యాలయంలో రూరల్ ఎంపీడీవో, సంబంధిత శాఖలకు సంబంధించిన మండలాధికారుల సమక్షంలో జరిగింది. ఈ తనిఖీ 2023-24 సంవత్సరానికి సంబంధించి నిర్వహించారు. అయితే దీనికి సంబంధించిన రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను సమర్పించారు.ఇందులో కూలీల మస్తర్లు, చేసిన పనుల్లో కొలతలు తేడాలు, జియోట్యాగింగ్ లేకపోవడం, తదితర అంశాలపై ఆరా తీశారు. అయితే క్షేత్రస్థాయిలో లెక్కలు తేడాలు గుర్తించి రూ. లక్షా 12వేల 27 రికవరీ చేయాలని అధికారులు తేల్చారు. రాజవోలుకి సంబంధించి రూ.56940, కాతేరులో రూ. 24,091, బొమ్మూరులో రూ. 7054, ధవళేశ్వరంలో రూ.7000, కోలమూరు సంబంధించి రూ.7,820 వున్నాయి. ఈ మొత్తంలో ఒక్క టీఏ (టెక్నికల్ అసిస్టెంట్) వద్ద నుంచే సుమారు రూ.75వేల చేయాలని నివేదికలో చేర్చినట్టు తెలిసింది. అదేవిధంగా కాలువల్లో పూడికతీతలు, చెరువులలో చేపట్టిన పనులకు సంబంధించి రూ. 83 లక్షల 61 వేల 847కు గాను ఏపీడీ విచారణ చేపట్టి నివేదిక సమర్పించాల్సిందిగా అధికారులు నివేదికలో పేర్కొన్నారు. వీటిలో వెంకటనగరానికి సంబంధించి రూ. 31 లక్షల 85వేల 886, ధవళేశ్వరానికి సంబంధించి రూ.22 లక్షల 13వేల 855, కోలమూరుకు సంబంధించి రూ. 14 లక్షల 30 వేల 520, పిడింగొయ్యికి సంబంధించి రూ. 13 లక్షల70 వేల 424, రాజవోలుకు సంబంధించి రూ. ఐదు లక్షల 97 వేల 40, కాతేరుకు సంబంధించి రూ. 8 లక్షల నాలుగు వేల 670 వున్నాయి. అదేవిధంగా అపరాధ రుసుము కింద రూ.21 వేలు రికవరీ చేయాలని ఆ నివేదికలో పేర్కొన్నారు.

● కాతేరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

కాతేరులో నిర్వహించిన పనులకు సంబంధించి రికార్డులు సరిగా నిర్వహించకపోవడం, మస్తర్ల విషయంలో అవతవకలు జరిగాయని గుర్తించారు.

ఈ కారణాలతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

నిడదవోలులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

నిడదవోలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సమాజ సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు బలగం అప్పారావు అన్నారు. శనివారం నిడదవోలులోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రాజమహేంద్రవరానికి చెందిన అకీరా నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ ప్రతినెలా అకీరా ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తామని, పెన్షనర్స్ కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యదర్శి కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ పెన్షనర్స్ అందరూ ట్రెజరీలో లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించాలని, ట్రెజరీ కార్యాలయానికి రాలేని వారి ఇళ్ల వద్దకే వెళ్లి సర్టిఫికెట్లు సేకరించే ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో లల్లీ విశ్వామిత్ర, నరసింహమూర్తి, సామ్రాజ్యం, రత్నం, గంగుమళ్ల హనుమంతరావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ నిరాశపర్చింది



● సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ సామాన్య, మధ్యతరగతి ప్రజలను తీవ్రంగా నిరాశపర్చిందని, కేంద్రపెద్దలు ఏపీకి మొండిచెయ్యి చూపారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విమర్శించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర బడ్జెట్‌పై స్పందించారు. ఆదాయపు పన్ను రాయితీ కొంతమేర ఇచ్చినా.. పెరిగినా దానితో పెద్దగా ఒరిగేదేమీ ఉండదని, భారీగా పెరిగిన నిత్యావసరాల ధరలతో మధ్యతరగతి ప్రజల జేబులు ఖాళీ అవుతాయన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూటమిదే విజయం

● రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూటమి ప్రభుత్వానిదే విజయమని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం సాయంత్రం తన నివాసంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, జిల్లా పరిశీలకులు మందలపు రవికుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెలుగుబంటి ప్రసాద్, రాష్ట్ర హెల్త్ విభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్, టీడీపీ, బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను మనమంతా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రూరల్‌లో 8,365 మంది ఓటర్లు ఉన్నారని, వారందరికీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి వివరించాలని బూత్ కన్వీనర్లకు సూచించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

●ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు ● జీటీజీహెచ్ సూపరింటెండెంట్‌తో చర్చలు


సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నేతలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైద్య ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి(జీటీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభను కలసి చర్చించారు. శనివారం జీటీజీహెచ్‌లోని సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఈ మేరకు సమావేశమై ప్రధానంగా ఉద్యోగుల ఖాళీలకు సంబంధించి కేడర్ స్ట్రెంగ్త్, ఇతర సమస్యలపై మాట్లాడారు. విధి నిర్వహణలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సూపరింటెండెంట్ దృష్టికి తెచ్చారు. ఈమేరకు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.రవికుమార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించారని, ఉద్యోగ ఖాళీలకు సంబంధించి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు కరస్పాండెంట్ చేస్తున్నామని చెప్పారని తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కారం కోసం మరోసారి సమావేశమై చర్చించడానికి సూపరింటెండెంట్ సంసిద్ధత వ్యక్తం చేశారని రవికుమార్ పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ, ఉపాధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి అంజలి, ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈనెల 2న కాకినాడలో జరిగే జిల్లా మహాసభను ఉద్యోగులంతా జయప్రదం చేయాలని రవికుమార్ కోరారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడిగా యర్రా

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి పరిశీలకుడిగా టీడీపీ సీనియర్ నేత యర్రా వేణుగోపాలరాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలిచ్చారు. యర్రాను ఆచంట నియోజకవర్గ పరిశీలకుడిగా నియమించారు.

ఎన్నికల్లో కూటమి పార్టీల నాయకులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. యర్రా మాట్లాడుతూ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

ఆర్థికశాస్త్రం అభ్యసిస్తే అగ్రగామిగా నిలవొచ్చు

● శాస్త్రవేత్త కృష్ణ నడింపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

రాజానగరం, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాస్త్రం అభ్యసిస్తే ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవొచ్చని ఆస్ట్రేలియాలోని ప్రకృతి విపత్తుల నివారణ శాస్త్రవేత్తగా విశేష కృషి చేసిన కృష్ణ నడింపల్లి అన్నారు. గైట్ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ వల్లీ మాధవి అధ్యక్షతన వృత్తిపరమైన విజయం కోసం వ్యక్తిగత బ్రాండ్‌ను రూపొందించడం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. దీనికి రిసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో ఎంతో శక్తివంతమైన సాంకేతికత మొబైల్ రూపంలో ఉందన్నారు. కార్యక్రమంలో జీజీయూ పరిశోధనా అభివృద్ధి డైరెక్టర్ ఆర్ఎస్ రాజు, గైట్ డిగ్రీ కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు ఎన్.సావిత్రి, సీహెచ్ వెంకటేశ్వర్లు, జీ.నగేష్, కె.సతయ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ : ఆత్మ పీడీ


శిక్షణలో మాట్లాడుతున్న కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, పీడీ

రాజానగరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని యువత స్వయం సంవృద్ధి సాధించే దిశగా పయనించాలని తూర్పు గోదావరి జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి ఆకాంక్షించారు. కలవచర్ల కృషీ విజ్ఞాన కేంద్రం ఆత్మ- తూర్పుగోదావరి జిల్లా సౌజన్యంతో గ్రామీణ యువతకు వ్యవసాయ, ఉద్యాన పంటల్లో సస్యరక్షణ పద్ధతులపై వారం రోజుల పాటు నిర్వహించనున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. దీనికి వై.జ్యోతిర్మయి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ కల్పించి, వారి స్వయం ఉపాధి దిశగా ఎదిగేందుకు కలవచర్ల కృషీ విజ్ఞాన కేంద్రం ఐకార్-నిర్‌కా అనేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. అనంతరం కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, కోర్సు కోఆర్డినేటర్ సస్యరక్షణాధికారి రఘునందన్ మాట్లాడారు. వారంరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి కడియం, గొల్లప్రోలు మండలాలకు చెందిన ఔత్సాహిక యువతీ యువకులు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానపంటల అధికారి జేవీఆర్ సత్యవాణి, పశు సంవర్థక అధికారి టి.విజయవర్దన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మగ్గం వర్క్ శిక్షణ


శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు

రాజానగరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాత వెలుగుబందలో ప్రారంభించిన మగ్గం వర్క్ శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు యుక్త వయస్సుకు వచ్చిన తర్వాత తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దాదాపు 50 మంది మహిళలకు ధ్రుపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ సుంకర వీరాస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యులు నాతిపాం జాన్, సత్యనారాయణ, ఫౌండేషన్ సభ్యులు, శిక్షకులు వెంకటపద్మ, దుర్గ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నిషేధించాలి : విశ్రాంత డీఎస్పీ బాబ్జీ


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాలను నిషేధించడం అందరి బాధ్యత అని విశ్రాంత డీఎస్పీ నామగిరి బాబ్జీ అన్నారు. మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆధ్వర్యంలో శనివారం డ్రగ్ అబ్యూజ్ అండ్ ఆల్కాహాల్ అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలువిషయాల గురించి తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఎస్.ఉదయభాస్కర్, ప్రిన్సిపాల్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిశోధనలకు జీజీయూ అధిక ప్రాధాన్యం

● జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు


సమావేశంలో మాట్లాడుతున్న జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలకు గోదావరి గ్లోబల్ విశ్వ విద్యాలయం (జీజీయు) అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆ యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) పేర్కొన్నారు. జీజీయూలో ఇంజనీరింగ్ అండ్ వైద్యశాస్త్రాల్లో కృత్రిమ మేధస్సు, ఆధారిత ఆవిష్కరణలు అనే అంశంపై శనివారం అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. అనంతరం చైతన్యరాజు, మరో ముఖ్యఅతిథి జీఎఫ్ఐ బోర్డు సభ్యురాలు, సహ వ్యవస్థాపకురాలు లీలారాజు న్యూయార్క్ వెల్ కార్నెల్ వైద్యకళాశాల ఆప్తమాలజీ క్లినికల్ అసోసియేట్ ప్రొఫెసర్ చాన్స్ ఏ.కోల్, అలాగూ జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ విల్మర్ ఐ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ థామస్ జాన్సన్ ఆస్ట్రేలియాలోని ప్రకృతి విపత్తుల నివారణ శాస్త్రవేత్త కృష్ణ నడింపల్లి ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, టీపీ ప్రసాద్, ఆర్ఎస్ రాజు, పీఎంఎంఎస్ శర్మ, టి.జయానంద కుమార్, వల్లీ మాధవి, పీజీ రామానుజం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం : ఎంపీడీవో


శ్రీనును సత్కరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

బిక్కవోలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీ ఫౌండేషన్ విద్యార్థులకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీడీవో వీ. శ్రీనివాస్ కొనియాడారు. ఇళ్లపల్లి జడ్పీ హైస్కూల్లో శనివారం రంగంపేట మండలం జి. దొంతమూరుకు చెందిన శ్రీఫౌండేషన్ అధ్యక్షుడు కాళ్ల శ్రీను 2023- 24లో ఆరు నుంచి పది తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, ఆటల్లో ప్రతిభ కనబరచిన, దివ్యాంగ విద్యార్థితో కలిపి 20 మందికి రజత పతకాలను అందజేసారు. దీంతో ఆయనను పాఠశాల హెచ్ఎం పప్పు శ్రీను, ఎంపీడీవో శ్రీనివాస్, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పలువురు పాల్గొన్నారు.

పందలపాకలో లలితేశ్వరి బంధువుల ఆందోళన



ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు బయలుదేరిన మహిళలు

బిక్కవోలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పందలపాకలో గత నెల 29న హత్యకు గురైన కురుపూడి లలితేశ్వరిన్ని హత్య చేసిన అందర్నీ అరెస్టు చేసి శిక్షించాలంటూ శనివారం పందలపాకలోని ఆమె బంధువులు, మహిళలు ఆందోళనకు దిగారు. దీనిలో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ హత్య కేసులో గుంతికోలు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేశామంటూ సీఐ పత్రికల్లో ఇచ్చిన వార్తతో తాము ఆందోళన చేపట్టామన్నారు. ఈ ఒక్క వ్యక్తే చేయలేదని, ఇంకా చాలా మంది ఉన్నారన్నారు. దీంతో విషయం తెలుసుకున్న అనపర్తి సీఐ సుమంత్ వారిని మార్గ మధ్యలో ఆపి ఏ1 దుర్గాప్రసాద్‌ను మాత్రమే అరెస్టు చేశామని, కేసును ఇంకా విచారిస్తున్నామని, మిగిలిన నిందితుల్ని కూడా త్వరలో అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు వెనుదిరిగారు.

ఘనంగా అధ్యయనోత్సవాలు


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

రంగంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వడిశలేరు గ్రామ ఇలవేల్పు శ్రీదేవి,భూదేవి సమేత భజే నారాయణ స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు సందర్భంగా శనివారం అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండకు చెందిన ముడుంబై రామానుజాచార్యులు, స్థానిక ప్రముఖ వేద పండితులు రేగడమిల్లి రామ్‌దేవ్ శర్మ శుక్లయజుర్వేద పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ మల్లిరెడ్డి శ్రీనివాస్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మలమ్మ ఇన్నాళ్లకు కరుణించారు. ఆదాయపు పన్ను పరిమితులను పెంచుతూ ఎట్టకేలకు పద్దులో పెద్ద పీట వేశా రు. పెరిగిన ఖర్చులకు తోడు ఎడాపెడా ఆదాయపు పన్ను వాతలతో వెన్ను విరిగిన ప్రభుత్వ, ప్రైవేటు జీవులకు ఊరట కలిగించారు. రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయానికి ఎలాంటి పన్ను కట్టక్కర్లేదని పార్లమెంట్ సాక్షిగా బడ్జెట్‌లో ప్రకటించారు. అటు వృద్ధులకూ నిర్మలమ్మ పద్దు వరాలు కురిపించింది. వడ్డీపై ఆదాయంతో పాటు అద్దెపై వచ్చే వార్షిక ఆదాయ పరిమితిని పెంచి వారిని ఆకట్టుకుంది. అన్నదాతలకు కిసాన్ క్రెడిట్ కార్డుల రూపంలో అప్పు పరిమితి పెంచిం ది. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు నిధులు విదిల్చి ఉమ్మడి జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో సాగు చేస్తోన్న రైతులకు తీపికబురు అందించింది. అటు చిన్న తరహా పరిశ్రమలకు ఊతమిస్తూనే కాకినాడ కేంద్రంగా ఉన్న షిప్ బిల్డింగ్ రంగం మరింతగా ఎదిగేలా వెన్నుదన్నుగా నిలిచింది. వెరసి కేంద్ర బడ్జెట్ అన్నివర్గాలను మెప్పించి మురిపించింది. - (కాకినాడ, ఆంధ్రజ్యోతి)



మురిపించే!



బడ్జెట్ బాగు..బాగు



బొమ్మూరులో వృద్ధుడికి పింఛను అందజేసి నమస్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రంచనుగా పింఛను

ఉదయం 11కే 85 శాతం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అదే వేగం.. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచీ ఠంచనుగా ఇంటికి వెళ్లి మరీ సామాజిక భద్రత పింఛన్‌ని చేతికి అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల కూడా అదే వేగాన్ని జిల్లా యంత్రాంగం కనబరచింది. శనివారం ఉదయం 10.30 గంటల సమయానికి 79 శాతం పూర్తి చేసింది. జిల్లా కలెక్టర్ ప్రశాంతి నేతృత్వంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పింఛన్ అందించడంలో మంచి ఫలితాలను సాధిస్తున్నారు.జిల్లాలో 2,36,331 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా సాయంత్రం 4గంటలకు 2,21,620 (93.78%) మందికి రూ.95 కోట్ల 62 లక్షల 73 వేలు పంపిణీ చేశారు. మండలాల వారీగా చూస్తే మొదటి మూడు స్థానాల్లో రాజమహేంద్రవరం అర్బన్ 95.70%, కోరుకొండ 95.18%, నిడదవోలు అర్బన్ 95.05% ఉన్నాయి.గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా పింఛను కోసం వృద్ధులు సైతం ముప్పుతిప్పలు పడిన అనుభవం తెలిసిందే. ఇప్పుడు ప్రతి నెలా ఉదయాన్నే పింఛను సొమ్ము ఇంటికే చేరుతుండడంతో లబ్ధిదారులు.. ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొమ్మూరు పంచాయతీ పరిధిలోని పలువురు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి కలెక్టర్ ప్రశాంతి పింఛన్లు అందజేశారు. ఆమె వెంట రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్, డీఆర్డీఏ పీడీ మూర్తి, రూరల్ స్పెషల్ ఆఫీసర్ కేవీఎస్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు ఉన్నారు.

వేతన జీవులకు ఊరట

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను మురిపించింది. ఎప్పుడూ వాతలతో సాగే బడ్జెట్ ఈ దఫా కొన్ని వరాలతో మెప్పించింది. ప్రధానంగా ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలంటూ ఎన్నో ఏళ్లుగా వేతన జీవులు వేడుకుంటున్నా కనికరించని ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ఈ సారి మొర విన్నారు. ఏకంగా రూ.12 లక్షల వార్షికాదాయం వరకు ఒక్క రూపాయి పన్ను కూడా చెల్లించక్కర్లేదని ప్రకటించి ఉద్యోగులపై వరాల వాన కురిపించారు. ఈ నిర్ణయంతో రూ.12 లక్షల వార్షికాదాయం పొందుతున్న వారికి రూ.80 వేల వరకు పన్ను పోటు తప్పి జేబులో డబ్బు మిగల నుంది.ఈ నిర్ణయం వల్ల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 63 వేల మందికి లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా వీరిలో 22 వేల మందికి వార్షిక వేతనం రూ.12 లక్షల వరకు వస్తోంది. వీరికి రూ.80 వేల వరకు మిగ లనుంది. మిగిలిన 41 వేల మంది ఉద్యోగులకు సైతం రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.65 వేల వరకు ప్రయోజనం కలగనుంది. అయితే కొత్త పన్ను విధానం కింద శ్లాబులను ప్రకటించడం కొంత గందరగోళానికి గురి చేసింది. దీని ప్రకారం రూ.4 లక్షల వరకు సున్నా పన్ను,రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పన్ను 5 శాతం, రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు 10 శాతం పన్ను శ్లాబు లను ప్రకటించారు. ఈ శ్లాబు ప్రకారం రూ.12 లక్షల వార్షిక వేతనం ఉన్న వారు పది శాతం పన్ను చెల్లించాల్సి ఉండగా దా న్ని సెక్షన్ 87ఏ రిబేట్ కింద బడ్జెట్‌లో మినహాయింపునిచ్చారు.దీంతో పన్ను సున్నాగా మారింది. దీనికి తోడు స్టాండర్డ్ డిడక్షన్ సైతం కలిపితే రూ.12.75 లక్షల వార్షికా దాయం వరకు పన్ను చెల్లించ క్కర్లేదు.దీనికి ఒక్క రూపాయి పెరిగినా పన్ను పరిధిలోకి వచ్చేస్తారు.బడ్జెట్ నిర్ణ యం నేప థ్యంలో రూ.8 లక్షల వార్షిక వేతనం ఉంటే రూ.30 వేలు, రూ.9 లక్షలకు రూ.40 వేలు, రూ.10 లక్షలకు రూ.50 వేలు, రూ.11 లక్షలకు రూ.65 వేల వరకు పన్ను పోటు తప్పింది.





పంట పండింది..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2.30 లక్షల హెక్టార్లలో వరి సాగవు తోంది.మొత్తం 5.40 లక్షల మంది రైతులు సాగుచేస్తున్నారు.వీరికి పంట రుణాల కింద ఏటా రూ.7,150 కోట్ల వరకు వివిధ బ్యాంకులు అందిస్తు న్నాయి. అయితే బ్యాంకులు షరతులతో ఇబ్బందులు పెడుతున్నాయి.కౌలురైతులకు అప్పు పుట్టని పరిస్థితి. ఈ నేపథ్యంలో కేంద్రం కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టి సాలీనా ఏడు శాతం వడ్డీకే రూ.3 లక్షల వరకు రుణాలంది స్తోంది. ఏడాదిలోగా రుణం తిరిగి చెల్లిస్తే 3 శాతం వడ్డీ రాయితీ ప్రక టిస్తోంది.ఈ సదుపాయాన్ని ఉమ్మడి జిల్లాలో వరి,ఇతర వాణిజ్య పంటల సాగుకు సుమారుగా 70 వేల మందికిపైగా అన్నదాతలు వాడుకుంటు న్నారు. పశుసంవర్ధకశాఖ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4,600 మంది రైతులు ఈ కార్డులు వినియో గిస్తున్నారు. బడ్జెట్‌లో ఇప్పు డు రూ.3 లక్షల రుణ పరిమితిని రూ.5 లక్షలకు పెంచడంతో వేలాది మంది అన్నదాతలకు ప్రయోజనం కలగనుంది. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కింద సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్రానికి రూ.186 కోట్లు కేటాయించింది.ఈ నిధులు ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లాలో వేలాది మంది రైతులకు ఆర్థికంగా అండ కల్పించనుంది.జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కింద ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల ఎకరాలు సాగవుతోంది. ఇందులో కాకినాడ జిల్లాలోనే 45 వేల ఎకరాలు ఉంది.

- వేతన జీవులకు, వృద్ధులకు ఊరట
- రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను జీరో
- ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షలమందికి లబ్ధి
- వార్షిక వేతనం రూ.12.75 లక్షలున్నా నో ట్యాక్స్
- వృద్ధులకు వడ్డీ, అద్దెలపై పరిమితుల పెంపు
- నేచురల్ ఫార్మింగ్‌కు రూ.186 కోట్లు
- కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంపు
- ఎంఎస్‌ఎంఈలకు రుణాల పెంపు
- 24 వేలకుపైగా చిన్న కంపెనీలకు ఊతం
- నౌకా రంగానికి భారీవరాలు
- ఉమ్మడి జిల్లాలో 3 డే కేర్ క్యాన్సర్ సెంటర్లు

నౌకాయానం..



నౌకల తయారీ రంగానికి ఈ దఫా బడ్జెట్‌లో కేంద్రం భారీగా ప్రోత్సా హకాలు ప్రకటించింది.దీంతో కాకినాడలో తయారవుతున్న నౌకలకు సంబంధించి ఆయా సంస్థలకు భారీ గా ఆర్థిక ప్రయోజనాలు చేకూరడంతో పాటు ఈ రంగం మరింతగా ఎదగడా ని కి అవకాశం ఏర్పడింది. వాస్తవానికి కాకి నాడలో శాన్ మెరైన్ సంస్థ నౌకల తయా రీలో పేరొందింది. భారీ నౌకల నుంచి మధ్య తరహా షిప్‌లు తయారు చేస్తోంది. అనేక మత్స్యకార సంస్థలు సైతం పెద్ద పెద్ద టగ్‌లు తయారు చేస్తున్నాయి. ప్రధానంగా నౌకల తయారీకి విదేశాల నుంచి ఎక్కువగా అనేక పరికరాలు దిగుమతి చేసుకోవాలి. ప్రస్తుతం వీటిపై సరాసరి 23 శాతం వరకు పన్ను వసూలు చేస్తు న్నారు.కానీ ఇకపై ఇది సున్నా. పదేళ్ల పాటు ఇది అమల్లో ఉండనుంది.నౌకల తయారీకి అయ్యే కోట్ల కొద్దీ ఖర్చుకు సంబంధించి ఆయా కంపెనీలు,సంస్థలు తెచ్చే రుణాలపై ఇంత వరకు సబ్సిడీ లేదు.ఈ బడ్జెట్‌లో ఏకంగా 20 శాతం ఫైనాన్స్ సబ్సిడీ ప్రకటిం చింది.నౌకల తయారీ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. నౌకల తయారీ భవిష్యత్తులో కాకినాడ కేంద్రంగా ఎదిగే అవకాశం ఏర్పడిందని శాన్‌మెరైన్ సంస్థ అధినేత అలీషా విశ్లేషించారు.

క్యాన్సర్ రోగులకు తగ్గనున్న భారం



క్యాన్సర్ రోగులకు దీర్ఘకాలిక ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో బాధితులకు ఊరట దక్కింది. ఖరీదైన మందులు కొనలేక ఆర్థికంగా చితికిపోతున్నారు.మందుల ధరలు దిగిరానుండడం ఊరటనివ్వనుంది. దేశవ్యాప్తంగా డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటు కానున్నా యి.ఈ కేంద్రాల్లో బాధితులకు వైద్యసాయం లభించనుంది.

చిన్న వాటికి పెద్ద ఊతం..

బడ్జెట్‌లో చిన్న మధ్యతరహా పరిశ్రమల (ఎం ఎస్ఎంఈ)కు రుణాలను రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పెంచారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికవేత్తలకు మేలు జరగనుంది.ఉమ్మడి జిల్లాలో 24 వేల వరకు చిన్నతరహా పరిశ్ర మలున్నాయి.బ్యాంకుల నుంచి రుణాలిస్తున్నా సరిపోవడం లేదు. దీంతో బయట నుంచి అప్పులు తెచ్చి నష్టపోతున్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన రుణ పెంపు ప్రకటన మేలు చేయనుంది. అటు స్టార్టప్‌లకు రుణాలు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంచేలా బడ్జెట్ లో ప్రకటించడం అనేక మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వెన్ను దన్నుగా లభించనుంది.

వృద్ధులకు వరాలు..



వృద్ధుల ఆదాయాన్ని సైతం వదలకుండా ఇన్నాళ్లు పన్ను పేరుతో జేబులు గుల్ల చేసేసిన కేంద్రం ఈ దఫా బడ్జెట్‌లో వారి చేతిలో డబ్బు లాక్కోకుండా ఎంతో కొంత మిగిలేలా నిర్ణయం తీసుకుంది. వృద్ధులు ఆర్జించే బ్యాంకు డిపా జిట్ల వడ్డీపై పన్ను మినహా యింపును పెంచింది. ప్రస్తుతం ఇది రూ.50వేలు ఉండ గా దాన్ని రూ.లక్షకు పెం చారు. అటు అద్దె ఆదాయంపై ఉమ్మడి జిల్లాలో అనేక మంది వృద్ధులైన ప్రభు త్వ ప్రైవేటు రిటైర్డ్ ఉద్యో గులు జీవిస్తున్నారు. వీరికి కూడా నిర్మలమ్మ తీపికబురు అందించారు.వీరికి అద్దెపై వచ్చే వార్షికాదాయం రూ.2.40 లక్ష లు దాటితే చెల్లించాల్సిన పన్నును మినహా యించి రూ.6 లక్షలకు పెంచారు. దీంతో వందలాది మందికి మేలు కలగనుంది.

పిల్లలతో ప్రయోగాలే ప్రయోగాలు..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 170 వరకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్నాయి. కొత్త తరహా ప్రయోగాలు ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్రం ఏటా వీటిని మంజూరు చేస్తోంది. ఒక్కో దానికి రూ.20లక్షల వరకు వెచ్చిస్తోంది. బడ్జెట్‌లో వీటికి కేంద్రం మరింత పెద్దపీట వేసింది. 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది.దీంతో ఉమ్మడి జిల్లాకు భారీగా ఈ ల్యాబ్‌లు మంజూరు కానున్నాయి. తద్వారామరిన్ని పాఠశాలల్లో సైన్స్‌పై విద్యార్థులు ప్రయోగాలు చేసే సౌలభ్యం పెరగనుంది.

పోలవరం ప్రాజెక్టుకు భారీ ఊతం

బడ్జెట్‌లో పోలవరంపై కేంద్రం మరింత కనికరం చూపింది. చాన్నాళ్ళుగా మూలనపడిన ఈ ప్రాజెక్టును గట్టెక్కించే దిశగా శరవేగంగా నిధులు కేటాయిస్తూనే వచ్చారు. ఈ క్రమంలోనే కేంద్ర బడ్జెట్‌లోను పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్ల పద్దు చూపించారు. గడిచిన ఐదేళ్లలో ఇంత మొత్తంలో పోలవరానికి కేటాయించడం దాదాపు ఇదే ప్రథమం. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 2027 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంలో రాష్ట్ర ప్రభుత్వం ఉండగా దీనికి కేంద్రం కూడా ఊతమిస్తూ వస్తుంది. తాజాగా 12 వేల కోట్ల రూపాయలు ఈ మధ్యనే కేంద్రం ప్రకటించగా ఇప్పుడు తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లోను ఐదు వేల కోట్లకుపైబడి కేటాయింపులు పేర్కొనడం పట్ల హర్షం వ్యక్తమవుతుంది. ఇంతకుముందే పోలవరం నిర్మాణానికి గ్రాంటు రూపంలో 12 వేల 157 కోట్ల రూపాయలు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రూ.54 కోట్లు కేటాయించారు.ఈ నేపథ్యంలో పోలవరం పూర్తి కావడానికి ఇక ఆటంకాలు లేవనే పరిస్థితి ఉంది. ఇక ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగేందుకు ఒకవైపు విడుదల చేసిన గ్రాంటు, మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు బట్టి చూస్తే ఇట్టే అవగతమవుతుంది.

మధ్యతరగతికి ఊరట



మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట నిచ్చే బడ్జెట్ ఇది.వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, మహిళలు, యువత, ఇలా అన్ని రంగాలను దృష్టిలో పెట్టుకుని వృద్ధిని పోత్సహించే బడ్జెట్. ఆర్థికాభివృద్ధిని, దేశాభివృద్ధిని ప్రోత్సహించే బడ్జెట్ రూపొందించారు. - పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీ

ఇది వికసిత్ భారత్ బడ్జెట్



వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణం రూ.3 లక్షల నుంచి రూ 5 లక్షలకు పెంపు , రూ.12 లక్షల వరకు ఆదాయపపన్ను మినహాయింపు ఇవ్వడం చరిత్రాత్మక నిర్ణయం.

- వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ మంత్రి

ప్రజారంజక బడ్జెట్



ప్రజారంజకమైన బడ్జెట్. రైతులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అభినందనీయం.రాష్ట్రానికి కేటాయించిన రూ.3ల క్షల కోట్ల నిధులను ఈ బడ్జెట్‌లో రెగ్యులర్ చేయడం రాష్ట్రానికి ప్రయోజనకరం. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.5లక్షలకు పెంచడం రైతులకు ప్రోత్సాహాన్నిస్తుంది.

- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఎమ్మెల్యే, అనపర్తి

2028 వరకు జలజీవన్..



రాష్ట్రంపై కేంద్రం వరాల జల్లు కురిపించింది.రాష్ట్ర ప్రజలకు మేలు చేసే బడ్జెట్. జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరందించాలనే ప్రధాని మోదీ సంకల్పానికి ఈ బడ్జెట్ అద్దం పడుతుంది. జలజీవన్ మిషన్ 2028 వరకు పొడిగింపుతో రాష్ట్రానికి మేలు.

- ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే, రాజమండ్రి

అనుకూల బడ్జెట్



మధ్యతరగతి వర్గాలకు అనుకూల బడ్జెట్. ఇన్‌కమ్ ట్యాక్స్ బెనిఫిట్స్ ,ట్యాక్స్ లిమిట్స్ పెంచడం వంటివి ట్యాక్స్ పెయర్స్‌కు సీనియర్ సిటీజన్లకు ఆనందం కలిగించేలా ఉన్నాయి. కిసాన్ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచడం బాగుంది. - గన్ని కృష్ణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శాంతామణి

డీపీవోగా శాంతామణి బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా వి.శాంతామణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం వైటీసీలో ఉన్న జిల్లా గ్రామపంచాయతీ అధికారి కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె కొవ్వూరు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేశారు. ఈమెకు ఏవో జగదీశ్వరి , కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

2 రోజులు.. 1536 రిజిస్ట్రేషన్లు



కడియం ఆర్‌వోలో శుక్రవారం రాత్రి కక్షిదారుల క్యూ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

భూముల విలువ పెరగడం రిజిస్ట్రేషన్ శాఖకు కలిసొచ్చింది. జనవరి నెలలో లక్ష్యాలను సాధించలేకపోవడంతో తలపట్టుకున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు నెలాఖరు రెండు రోజుల ఆదాయం కాస్త ఊరట కలిగించింది. శనివారం నుంచి పెంచిన భూముల విలువను ప్రభుత్వం అమల్లోకి తీసుకురావడంతో గురు, శుక్రవారాలు(గత నెల 30,31) రిజస్ట్రేషను కార్యాలయాలు జాతరను తలపించాయి. సాధారణంగా కొనుగోలు చేయడానికి మంగళ వారం, విక్రయించడానికి శుక్రవారం వెనకడుగు వేస్తుంటారు.కానీ భూముల విలువ పెరిగితే రిజిస్ట్రేషను రుసుం తదితర ఖర్చులు కూడా పెరుగుతా యి. అందువల్ల శుక్రవారం సెంటిమెంటును సైతం పక్కన పెట్టి కక్షిదారులు రిజిస్ట్రారు కార్యాలయాలకు క్యూ కట్టారు.ఆ ఒక్క రోజున జిల్లాలో రికార్డు స్థాయిలో 834 రిజిస్ట్రేషన్లు జరి గాయి. సర్వర్లు మొరాయించినా క్రయవిక్రయ దారులు మాత్రం ఓపిగ్గా రిజిస్ట్రేషను ప్రక్రియ పూర్తి చేశారు.మొత్తానికి జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల ద్వారా రెండు రోజుల్లో 1536 రిజిస్ట్రేషన్లు జరగ్గా రూ.13 కోట్ల 41 లక్షల 73 వేల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యింది. రాజానగరం, పిడింగొయ్యి, రాజమ హేంద్రవరం మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఎనీవేర్ రిజిస్ట్రేషను(కార్డ్ ప్రైమ్ 2.0)లో అప్రూవల్ కాల పరిమితిని కూట మి ప్రభుత్వం 48 గంటలకు పొడిగించడం వల్ల రిజిస్ట్రేషన్ల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోందని ఓ సబ్ రిజిస్ట్రారు అభిప్రాయం వ్యక్తం చేశారు.గతంలో ఆ సమయం గంట మాత్రమే ఉండేది.ఈ జనవరి నుంచి ఆ సమయాన్ని 48 గంటలకు పెంచడంతో అప్రూ వల్ రావడం ఆలస్యం అవుతోంది.దీంతో కక్షిదారులు ఇబ్బంది పడుతున్నారు.

భూముల విలువ పెంపుతో ముందస్తుగా..

30న, 31న రిజిస్ట్రేషన్లు ఇలా..

కార్యాలయం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం
అనపర్తి	35	25,42,000	78	50,46,000
అనంతపల్లి	93	50,71,735	99	41,93,572
బిక్కవోలు	72	41,90,063	43	15,93,840
కడియం	62	67,19,295	58	59,74,440
కోరుకొండ	40	27,68,425	26	20,39,345
కొవ్వూరు	72	42,67,959	97	91,11,376
నిడదవోలు	48	39,30,565	60	24,28,900
పిడింగొయ్యి	43	1,18,94000	68	1,10,02,000
రాజమండ్రి	78	94,75,000	126	1,10,58,595
రాజానగరం	115	1,32,74,275	114	1,16,12,510
సీతానగరం	22	6,27,980	23	8,04,495
వేగేశ్వరపురం	22	1,52,000	42	3,02,700

పెళ్లిసందడి.. వచ్చేసింది..



కడియం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం వచ్చేసింది. పెళ్లింట సందడి తెచ్చేసింది.. మాఘమాసంలో వివాహ ముహూర్తాలకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ఈ సీజన్‌లో పెళ్లిళ్లు చేసుకునేందుకు వధూవరుల కుటుంబాలు ఆసక్తి చూపుతాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు పంటలు చేతికి వచ్చి విరామ సమయంగా ఉండడంతో మాఘ మాసంలో పెళ్లిళ్లకు అనువైన సమయంగా భావిస్తుంటారు.ఇప్పటికే ఈ మాసం ప్రారంభం కావడంతో వివాహాలు ఊపందుకున్నాయి. దీంతో శనివారం నుంచి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. నాలుగు నెలల పాటు పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. ముందస్తు బుకింగ్‌లకు సన్నద్ధమవుతున్నారు. అంతే కాకుండా రాజమహేంద్రవరం మార్కెట్ కళకళలాడుతోంది. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే పాన్‌షాపుల నుంచి వస్త్ర, బంగారు దుకాణాలకు గిరాకీ ఉంటుంది. కల్యాణ మండపాలు, అలంకరణ, లైటింగ్, సౌండ్ సిస్టమ్, పూల అలంకరణలు, బ్యూటీషియన్, ఫొటో స్టూడియోలకు, ఇంకా పలురకాల మార్కెట్‌లకు చేతినిండా పని దొరుకుతుంది. ఉమ్మడి జిల్లాలో కల్యాణ మండపాలు 1000 వరకు ఉన్నాయి. ఇవన్నీ ఇప్పటికే బుకింగ్‌లతో నిండిపోయాయి. జిల్లాలో ప్రధాన పట్టణాలతో పాటు చిన్నచిన్న గ్రామాలు, కూడళ్లలో కల్యాణ మండపాలకు డిమాండ్ వచ్చింది. పెళ్లిళ్ల సందడితో హడాహుడి నెలకొంది.

- నేటి నుంచి ముహూర్తాలు
- 4 నెలల పాటు పెండ్లి సందడే
- కళకళలాడుతున్న మార్కెట్
- మండపాలకు డిమాండ్
- జోరుగా వివాహాలు

ముహూర్తాలు ఇలా..

- ఫిబ్రవరి : 2, 6, 7, 8, 12, 13, 14, 15, 16, 20, 22, 23
- మార్చి : 1, 2, 7, 9, 12, 14, 15, 16
- ఏప్రిల్ : 9, 10, 11, 12, 17, 18, 20, 23, 29, 30
- మే : 1, 7, 8, 9, 10, 11, 14, 15, 16, 17, 18, 21, 22, 28(జ్యేష్ఠమాసం)



కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ప్రభుత్వ పాఠశాలల్లో రోల్ వెరిఫికేషన్



పోతవరం హైస్కూల్లో విద్యార్థుల నమోదు పరిశీలిస్తున్న ఎంఈవో సత్యనారాయణ

నల్లజర్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాల రిస్ట్రక్చర్ ఆర్గనైజేషన్ చేస్తున్న దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు రోల్ వెరిఫికేషన్ కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభమైంది. 2024 డిసెంబరు 31వ తేదీ నాటికి ఆయా పాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులు నమోదై ఉన్నారు, ఎంత మంది బడికి హాజరవుతున్నారన్న విషయాలను ఈ వెరిఫికేషన్ ద్వారా తెలుసుకోనున్నారు. పేర్లు ప్రభుత్వ పాఠశాలలోను, చదువు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారా అనే విషయాలను పరిశీలించనున్నారు. స్థానిక ఉపాధ్యాయ పోస్టులను నిలుపుకునే ప్రయత్నంలో తప్పుడు రోల్ ఎక్కడైనా నమోదైందా అన్న విషయాల పరిశీలన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నారు. పోతవరం కాంప్లెక్స్ ఎంఈవో సత్యనారాయణ బృందం పరిశీలించగా దూబచర్ల పరిధిలో ఎంఈవో-2 భగవతి బృందం, అనంతల్లి పరిధిలో ఎంపీడీవో సింహాద్రి పరిశీలించారు.

నిడదవోలులో ఉచిత నేత్ర వైద్య శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న బలగం అప్పారావు

నిడదవోలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సమాజ సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు బలగం అప్పారావు అన్నారు. శనివారం నిడదవోలులోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రాజమహేంద్రవరానికి చెందిన అకీరా నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ ప్రతి నెలా అకీరా ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని, పెన్షనర్స్ కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యదర్శి కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ పెన్షనర్స్ అందరూ ట్రెజరీలో లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించాలని, ట్రెజరీ కార్యాలయానికి రాలేని వారి ఇళ్ల వద్దకే వెళ్లి సర్టిఫికెట్లు సేకరించే ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో లల్లీ విశ్వామిత్ర, నరసింహమూర్తి, సామ్రాజ్యం, రత్నం, గంగుమళ్ల హనుమంతరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ హామీలను నిలబెట్టుకోవాలి

ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్



పెండ్యాల సమావేశంలో మాట్లాడుతున్న గ్రీష్మకుమార్

నిడదవోలు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. నిడదవోలు మండలం పెండ్యాలలో శనివారం ఐఎఫ్‌టీయూ అనుబంధ సంస్థ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. గ్రీష్మకుమార్ మాట్లాడుతూ గడిచిన ఆరేళ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికులకు ఏ విధమైన ఆర్థిక పరిహారాలు అందలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 8 నెలలు అవుతున్నా కార్మికుల సంక్షేమాన్ని మరిచారని విమర్శించారు. సమావేశంలో అధ్యక్షుడు వాకా సత్యనారాయణ, కారింకి రమేష్, ప్రత్తిపాటి వెంకటేశ్వరావు, మిద్దే రాంబాబు, వేల్పూరి శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పారావు సేవలు అభినందనీయం



అప్పారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

చాగల్లు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో విధులు నిర్వర్తించి సమర్థవంతగా పనిచేసి అందరి మన్ననలను పొందడం అభినందనీయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని నెలటూరులోని శ్రీసీతారామ కల్యాణ మండపంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా పదవీ విరమణ చేసిన నల్లూరి అప్పారావు, ఆయన సతీమణి ఉషారాణి దంపతుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ముప్పిడితో పాటు లయన్స్‌క్లబ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా సత్కరించారు. విధి నిర్వహణలో చేసిన సేవలను అభినందించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, సూరపనేని చిన్ని, ఈడుపుగంటి మురళి, బొల్లిన శివనాగేంద్ర, ఈడుపుగంటి సుబ్బారావు, ఆళ్ల వెంకట సత్యనారాయణ, పీవీ సత్యనారాయణ, ఆళ్ల సత్యనారాయణ, తాళ్లూరి ప్రసాద్, ఆర్‌బ్ల్యూఎస్ ఈఈ బీవీ గిరి పాల్గొన్నారు. లయన్స్ కార్యదర్శి పీవీ రామారావు సన్మాన పత్రం బహూకరించారు.

సేంద్రియ ఆకుకూరలనే వినియోగిద్దాం



పి.చోడవరంలో ఆకుకూరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ హిమబిందు

నల్లజర్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆకు, కాయగూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చని పడమర చోడవరం సర్పంచ్ పెండ్యాల హిమబిందు అన్నారు. శనివారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆకు కూరలను ఆమె గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మహిళాదేవి, పెండ్యాల చందు, మద్దిపాటి సుబ్బారావు, అంగన్‌వాడీ టీచర్ సాయి, వీఆర్వో మధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పక్కింటికి ఎదురింటికి వెళ్లవద్దని ఇంట్లోనే ఉండాలని తల్లి మందలించిందని ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం శేషయ్యమెట్టకు చెందిన దాసరి తులసీ, శ్రీనివాస్ దంపతులకు నాగసాయి దుర్గ(12), ఓ బాలుడు సంతానం. 2021లో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ మృతిచెందాడు. దాంతో తులసీ అదే ఏడాది బోగిన నాగేశ్వరావు అనే డ్రైవర్‌ను రెండో పెళ్లి చేసుకుంది. అప్పటి నుంచి తల్లితో సాయిదుర్గ ఇష్టంగా ఉండడం లేదు. ఎక్కువ శాతం ఇరుగింటి వద్ద పొరుగింటి వద్ద ఉంటోంది. స్థానికంగా ఓ స్కూల్లో 7వ తరగతి చదువుతోంది. తులసి మెయిన్ రోడ్డులోని ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. ఉదయం పనికి వెళ్లి సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చి పిల్లలకు భోజనం తయారు చేసి తిరిగి పనిలోకి వెళ్లిపోతుంది. ఈ క్రమంలో శుక్రవారం దుర్గ స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి వద్ద ఉండడంతో మందలించి వెళ్లింది. సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చి అన్నం వండి ఎదురింటి వద్ద ఉన్న దుర్గను పిలిచి మందలించింది. దీంతో ఇద్దరు గొడవ పడ్డారు. ఆపై ఇంట్లో ఉండాలని చెప్పి తల్లి వెళ్లిపోయింది. అయితే తల్లితో గొడవ పడిన దుర్గ తల్లి వెళ్లిపోయాక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. రాత్రి తల్లి వచ్చి చూసే సరికి ఫ్యానుకు వేళాడుతు కనిపించింది. స్థానికుల సహకారంతో దుర్గను కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీ తరలించారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

నలుగురికి గాయాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు గ్రామం ఆటోనగర్ జంక్షన్ వద్ద ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన సోమరాజు అతడి తమ్ముడి కుటుంబ సభ్యులు కలిసి బెండపూడి బంధువుల ఇంటికి ఆటోలో వెళ్లారు. తిరిగి దివాన్‌చెరువు మీదుగా రాజమహేంద్రవరం వస్తుండగా ఆటోనగర్ వద్ద ఓ లారీ ఆటోనగర్ లోంచి బయటకు వస్తూ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బోడపాటి సోమరాజు(80) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న దొమ్మేటి అర్జునరావు, అచ్చియ్యమ్మ, మల్లిబాబులకు తీవ్రంగాను, సత్యనారాయణకు స్వల్పంగాను గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బొమ్మూరు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీ తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ పంట మాకొద్దు!

- గిట్టుబాటు కాని కొత్తిమీర
- కిలో కేవలం రూ.5లు
- ధరలేక రైతుల దిగాలు
- సాగుదారుల ఇబ్బందులు
- కూలి ఖర్చులు రాక నష్టాలు
- పంటకు కలుపు మందు
- కలిసిరాని కొత్తమీర సాగు



కొత్తిమీర పంట తీసేసేందుకు కలుపుమందు కొడుతున్న రైతు

పెరవలి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కూరల్లో కరివేపాకుతో పాటు కొత్తి మీర వేస్తే ఆ రుచే వేరు. చేపల పులుసులో కొత్తిమీర లేకుండా ఆ కూరను ఊహించలేము. అంతటి ప్రాధాన్యం, డిమాండ్ ఉన్న కొత్తిమీరకు గడ్డుకాలం వచ్చింది. పంట వేసిన రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో తీవ్ర ఆవేద వ్యక్తం చేస్తున్నారు. కొత్తిమీరను కూలీలతో పీకించి మార్కెట్‌కు తరలిస్తున్నామని, కనీసం కూలి డబ్బులు కూడా రావడం లేదని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు అంటున్నారు. కొత్తిమీరకు నెల క్రితం ఉన్న డిమాండ్ ప్రస్తుతం లేదని, రెండు నెలల క్రితం ఎకరం పొలంలో కొత్తిమీర రూ.లక్ష ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం రూ.5 వేలు రావడంలో లేదని వాపోతున్నారు. కిలో కొత్తిమీర రూ.5 ధర పలుకుతుందని చెబుతున్నారు. సంవత్సరం పొడవునా కొత్తి మీర పండదు. చల్లటి వాతావరణం ఉన్న సమయంలోనే కొత్తిమీర వేస్తారు. ఖాళీ అయిన చేలల్లో పంటను వేస్తున్నారు. ఏప్రిల్, మేలలో కొత్తి మీర రాదు. అయితే గతంలో కొత్తిమీరకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది పంట వేశారు. పంట వేసిన 40 రోజుల్లో చేతి కొస్తుంది. ఎకరానికి రూ.30 నుంచి రూ.40 వేలు ఖర్చు అవుతుందని, అయితే ప్రస్తుతం కూలి ఖర్చులు కూడా రావడం లేదని చెబుతున్నారు. కిలో రూ.20 పైనే ఉంటే గిట్టుబాటు అవుతుం దని, అయితే ప్రస్తుతం రూ.5 మాత్రమే ఉందని చెబుతున్నారు. కొత్తిమీర పంట పెట్టుబడి, కూలి, రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు పంటను తీసేస్తున్నారు. కొత్తి మీర గుబాలింపు రావాల్సిన ప్రదేశంలో కలుపు మందు వాసన వస్తోంది. ఎక్కువ మంది కొత్తిమీర వైపు మొగ్గు చూడకుండా వేరే కాయగూరలు వేయాలని సూచిస్తున్నారు.

ఈ పరిస్థితి ఎప్పుడూ చూడలేదు



గత 20 సంవత్సరా లుగా కొత్తిమీర సాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం ఉన్న పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. కనీసం పెట్టుబడి ఖర్చులు అయినా రావడం లేదు. కట్టలు కట్టి మార్కెట్‌కు తరలిస్తే ఆదాయం మాట అటుంచితే జేబులో డబ్బులు ఇస్తున్నాం. వేరే కూరగాయలు వేయాలనే ఉద్దేశంతో ప్రస్తుతం ఉన్న పంటను తీసేసేందుకు పొలానికి కలుపు మందు కొడుతున్నాం.

-కె.రాము, రైతు

9 నుంచి క్రికెట్ టోర్నమెంటు

పెరవలి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పిట్టల వేమవరంలో ఈ నెల 9 నుంచి శ్రీమహాలక్ష్మి పోలేరమ్మ క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 5వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనేవారు 86882 29754, 93467 95177 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

పింఛన్లు 95 శాతం పంపిణీ

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 01 (ఆంధ్రజ్యోతి): మండలంలో 95శాతం సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో వీఎస్ రామారావు శనివారం తెలిపారు. మండలంలో అన్ని రకాల పింఛన్లకు సంబంధించి 10,328 మంది లబ్ధిదారులు ఉండగా, 9760 మందికి పంపిణీ చేయగా మిగిలిన 568 మందికి ఆది, సోమవారాల్లో అందజేస్తామన్నారు.

పెరవలి: మండలంలో 10,217 మందికి గాను శనివారం సాయంత్రానికి 9,663(94.63 శాతం) మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో తెలిపారు.

పాలంగిలో పారిశుధ్య పనులు



ఉండ్రాజవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి గ్రామంలో శనివారం పారిశుధ్య కార్యక్రమాల్లో ముమ్మరంగా నిర్వహించారు. రోడ్ల పక్క చెత్త చెదారాలను ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. దోమల నివారణకు డ్రైన్లలో దోమల మందు పిచికారీ చేశారు. కార్యక్రమాలను సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ హసన్‌జాని పర్యవేక్షించారు.

కొవ్వూరు నుంచి కుంభమేళాకు తరలిన బస్సులు



కొవ్వూరు నుంచి కుంభమేళాకు వెళ్తున్న బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నుంచి కుంభమేళాకు యాత్రికులతో వెళ్తున్న బస్సులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. శనివారం కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రయాగ్‌రాజ్, కాశీలకు రెండు బస్సులు బయలుదేరాయి. ప్రయాణికులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ మాట్లాడుతూ శనివారం కొవ్వూరు నుంచి బయలుదేరిన 2 బస్సులు భువనేశ్వర్, పూరి, కోణార్క్, ప్రయాగ్‌రాజ్, కాశీ, గయ, బుద్ధగయలలో దర్శనం చేసుకుని 8వ తేదీ ఉదయం కొవ్వూరు చేరుకుంటాయన్నారు. కుంభమేళా యాత్రకు వచ్చే ప్రతి ప్రయాణికుడితో వాట్స్ 3 వర్ష్ యాప్ డౌన్ చేయించామని, డ్రైవర్, కుక్, గైడ్ నెంబర్లతో ప్రింట్ చేసిన ఐడీ కార్డులను అందించామన్నారు. ఈ నెల 14న మరో 3 బస్సులను ప్రయాగ్‌రాజ్ పంపనున్నట్టు డీఎం తెలిపారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పిల్లలమర్రి మురళీకృష్ణ, టీఎస్వీ రమణమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి మహాలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు



మహాలింగేశ్వర ఆలయ ముఖమండపం

దేవరపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గౌరీపట్నంలో శ్రీగౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి పరివార దేవతలు జీవ ధ్వజస్తంభంతో ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు ఈ నెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆలయాన్ని రూ.7కోట్ల వ్యయంతో అన్ని హంగులతో పునర్నిర్మించారు. 8ఎకరాల విస్తీర్ణంలోని ఆలయాన్ని నిర్మించి దానికెదురుగా ఒక ఎకరం స్థలంలో కోనేరును నిర్మించారు. ఈ ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు, లక్ష్మీనారాయణ స్వామి విగ్రహం, బ్రహ్మ, సరస్వతి, దక్షిణామూర్తి, నందీశ్వరుడు, కాలభైరవుడు, భృంగి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

అంగన్వాడీ భవనాలకు రంగులు



దేవరపల్లిలో రంగు వేసిన అంగన్వాడీ భవనం

దేవరపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్వాడీ భవనాలకు రంగులు వేయాలన్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు దేవరపల్లిలో అంగన్వాడీ భవనాలకు రంగులు వేయించినట్టు పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్ తెలిపారు. మండలంలో ఇటీవల అంగన్వాడీ భవనాల తనిఖీల నిమిత్తం ఆమె సందర్శించినప్పుడు భవనాలకు రంగులు వేసి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆమె ఆదేశాల మేరకు రంగు వేసే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి జయరాజు

కొవ్వూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో విశాఖ ఉక్కుకు నిధులు కేటాయింపు రాష్ట్రానికి మేలు కలుగగా, పేదరిక నిర్మూలన లక్ష్యం, రైతులకు, మహిళలకు ప్రాధాన్యం కల్పించడం హర్షణీయమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు అన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అనేక రకాల మేలుకరంగా, ప్రయోజకరంగా ఉందన్నారు. అమరావతికి నిధులు కేటాయింపు, పోలవరం ప్రాజెక్టుకు రూ.400 కోట్లు అదనపు కేటాయింపుపై హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర బడ్జెట్ అంకెల గారడీ

కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు కోఆర్డినేటర్ ఫసీ యుల్లాబేగ్

కొవ్వూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ అంకెల గారడీ అని, కొత్త సీసాలో పాత సారా నింపినట్టు ఉందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎండీ ఫసీ యుల్లాబేగ్ అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదించడం సమంజసం కాదన్నారు. దీని వల్ల బహుళార్థక సాధక ప్రాజెక్టు చిన్నపాటి రిజర్వాయిర్‌గా మారే అవకాశం ఉందన్నారు. కేవలం రూ.5000 కోట్లతో కేటాయింపుతో ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందన్నారు. ఇది ఢిల్లీ, బీహర్ ముందస్తు ఎన్నికల బడ్జెట్. ఢిల్లీ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని ట్యాక్స్ పేయర్లకు ఊరట కల్పించారన్నారు. ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మొండిచెయ్యి చూపించారన్నారు. ఈ నెల 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఉంటే 1న హడావుడిగా బడ్జెట్ ప్రవేశ పెట్టడంలో అంతర్యం ఏమిటన్నారు.

ధరల అదుపునకు చర్యల్లేవు

పారిశ్రామికవేత్త వెంకన్నచౌదరి



చాగల్లు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ద్రవ్యోల్బణం అదుపు, వడ్డీ రేట్లు తగ్గుదల, ఉత్పత్తి పెరుగుదల లేకుండా స్థూల జాతీయ పెరుగుదల సాధ్యం కాదని ప్రముఖ పారిశ్రామికవేత్త సుంకవల్లి వెంకన్నచౌదరి అభిప్రాయపడ్డారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీకి రుణాలు, బ్యాంకుల అప్పుల నిబంధనలు సరళీకరించి సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఉత్పత్తి పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం రెవెన్యూ వ్యయం తగ్గించి పెట్టుబడులు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



ముక్కామల శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ వెంకటేశ్వర్లుకు సత్కారం

పెరవలి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ముక్కామల శాఖా గ్రంథాలయం అభివృద్ధికి లైబ్రేరియన్ ఎం.వెంకటేశ్వర్లు ఎంతో కృషి చేశారని గ్రంథాలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కడియాల సాయి రామారావు అన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ లైబ్రేరియన్‌గా అవార్డు అందుకున్న వెంకటేశ్వర్లును గ్రంథాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో కరుటూరి విశ్వనాథం, కొంపెల్ల పట్టాభిరామం తదితరులు పాల్గొన్నారు.

వీరేష్ కుటుంబానికి ఆర్థిక సాయం

తాళ్లపూడి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకపల్లికి చెందిన గెడ్డం వీరేష్‌బాబు ఇటీవల మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసినట్టు ఏపీ లిక్కర్ షాపు వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. గతంలో టీడీపీ పరిపాలనలో బ్రాందీ షాపుల్లో పనిచేసిన అనేక మంది వర్కర్లు వైసీపీ పాలనలో పనుల్లేక అప్పుల పాలయ్యారని, అటువంటి వారిలో ఒకరైన వీరేష్ ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబం ఇబ్బందుల్లో ఉందని తెలిసి ఆర్థిక సాయం, నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, గెడ్డం శ్యాం, శ్రీకాంత్, సతీష్, వినోద్, పాపారావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిషేధించాలి

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను నిషేధించడం అందరి బాధ్యత అని విశ్రాంత డీఎస్పీ నామగిరి బాబ్జీ అన్నారు. మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నన్నయ విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆధ్వర్యంలో శనివారం డ్రగ్ అబ్యూజ్ అండ్ ఆల్కాహాల్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తదితర అధికారులు పాల్గొన్నారు.